ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి
# జనంవార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | ఆదివారం | 23.08.2026 | సంపుటి : 2 | సంచిక : 51 | పేజీలు : 8 | వెల : 5/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు

## తెలంగాణలో విద్యా, పరిశోధనలకు
# కేంబ్రిడ్జ్ సహకారం

### యూనివర్సిటీ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు
### హైదరాబాద్‌లో విద్యావ్యవస్థ పటిష్టతకు అంగీకారం



**తెలంగాణకు ప్రపంచస్థాయి విద్యాసంస్థలను తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు బృందం లండన్ యూనివర్సిటీని సందర్శించింది. తెలంగాణలో ఉన్న అవకాశాలపై ఆ వర్సిటీ ప్రతినిధులతో సీఎం బృందం చర్చించింది. హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటుకు ఆలోచిస్తున్నట్లుగా లండన్ వర్సిటీ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి తన బృందంతో కలిసి కేంబ్రిడ్జ్ వర్సిటీకి వెళ్లారు. ఆ వర్సిటీ ప్రతినిధులతో సమావేశమై విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై చర్చించారు.**

హైదరాబాద్, ఆగస్ట్ 22 : తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్ రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధులు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన విద్యావేత్తలు, ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం, అంతర్జాతీయ స్థాయి విద్యా కార్యక్రమాలను హైదరాబాద్‌లో నిర్వహించడం, సంయుక్త పరిశోధనలకు అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై చర్చ జరిగింది. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను ప్రతినిధులు కేంబ్రిడ్జ్ బృందం దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించేందుకు కేంబ్రిడ్జ్ ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఉన్న మానవ వనరులు, సాంకేతిక సామర్థ్యాలు, పరిశ్రమలు, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థపై కూడా సమావేశంలో వివరించారు. అదేవిధంగా సంయుక్త పరిశోధనా ప్రాజెక్టులు, ఇంక్యుబేషన్ కార్యక్రమాలు, స్టార్టప్‌ల అభివృద్ధి, యువ పారిశ్రామికవేత్తలకు మార్గదర్శకత్వం, అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ఇరుపక్షాలు చర్చించాయి. తెలంగాణ యువతలో ఉన్న ప్రతిభను

-మిగతా 2 లో..



## ఇందిరమ్మ ఇళ్ల పేరుతో
# ఓట్లు అడగం

### అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు
### హైదరాబాద్ తరహాలో హౌజింగ్ టవర్స్ నిర్మాణం
### నిజామాబాద్ పర్యటనలో మంత్రి పొంగులేటి

**నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి.. ఆ పేరుతో ఓట్లు అడిగే ప్రసక్తే లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో పర్యటించిన మంత్రి.. నగరంలో హౌసింగ్ టవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ ప్రవేశం చేసిన మహిళలకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు చెప్పారు. నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కొత్త టెక్నాలజీతో ఇందిరమ్మ మోడల్ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలలో హైదరాబాద్ తరహా ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణం చేపడతామని అన్నారు.**

నిజామాబాద్, ఆగస్ట్ 22 : పైలట్ ప్రాజెక్ట్‌గా నిజామాబాద్ కార్పోరేషన్ పరిధిలో శ్రీకారం చుట్టామని మంత్రి పొంగులేటి అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు 230 రూపాయలకే సిమెంట్ బస్తా ఇవ్వడానికి కంపెనీలు ముందుకు వచ్చాయని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు మంతంరి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం జరిగింది. పట్టణంలో రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు మంజూరు

-మిగతా 2 లో..



ఆరోగ్యం బాలేకపోతే..
# చాట్‌జీపీటీలో వెతికేస్తున్నారు

### రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

నోయిడా, ఆగస్ట్ 22 : అనారోగ్యానికి గురైతే వైద్యుడి వద్దకు వెళ్లకుండా ఇంటర్నెట్, చాట్‌జీపీటీలో లక్షణాలను వెతికి.. తమకు ఫలానా వ్యాధి ఉందని ఊహించుకోవద్దని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సూచించారు. అలా చూసుకునేవారి సంఖ్య దేశంలో రోజురోజుకీ పెరుగుతోందని తెలిపారు. శనివారం నోయిడాలో ఆయన మాట్లాడుతూ.. "ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడం మంచి పరిణామమే. కానీ ఇంటర్నెట్‌లో కనిపించిన సమాచారంతో ఒక నిర్ణయానికి రావడం సరైంది కాదు. స్వల్పంగా ఛాతినొప్పి వచ్చినా.. ఆన్‌లైన్‌లో వెతికి తీవ్రమైన గుండె జబ్బు ఉందని కొందరు భయపడుతున్నారు. అదే నొప్పి.. ఆందోళన, కండరాల సమస్యల వల్ల కూడా రావచ్చు. కొందరు రోగులు వారికి ఉన్న లక్షణాలు చెప్పకుండా.. ఇంటర్నెట్‌లో చదివిన వ్యాధి పేరును వైద్యుడికి చెబుతున్నారు" అని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోగులు.. స్థానిక భాషలోని పదాలతో లక్షణాలను చెప్పడం కూడా వైద్యులకు సవాలేనని రాజ్‌నాథ్ అన్నారు. ఛాతీలో 'దుక్ దుక్'గా ఉందని ఓ గ్రామీణుడు వైద్యుడికి చెప్పిన ఉదాహరణను ఆయన వివరించారు. వైద్య విద్యలో 'దుక్ దుక్' అనే లక్షణం గురించి ఎక్కడా ఉండదని చమత్కరించారు. యంత్రాలు శరీరంలో ఏం జరుగుతుందో గుర్తించగలవు.. కానీ రోగి మనసులోని భయం, ఆందోళనను అర్థం చేసుకోవడం వైద్యులకే సాధ్యమని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు.



# 22ఏ నిషేధిత భూముల పేరిట అక్రమాలు

### భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ
### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్

హైదరాబాద్, ఆగస్ట్ 22 : రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి దండుకోగా.. కాంగ్రెస్ హయాంలో

-మిగతా 2 లో..

## పెట్టుబడులకు తెలంగాణని వేదికగా
# ఎంచుకోండి

**2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ**

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడమే లక్ష్యం**

**టెక్నాలజీ నుంచి జీవశాస్త్రాల వరకు..అపార అవకాశాలు**

**మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**



హైదరాబాద్, ఆగస్ట్ 22 : తెలంగాణకు రండి.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి... తెలంగాణలోనే ఆవిష్కరించండి. ప్రపంచానికి అవసరమైన పరిష్కారాలను ఇక్కడే ఊహిద్దాం... ఇక్కడే ఆవిష్కరిద్దాం... ఇక్కడి నుంచే ప్రపంచానికి అందిద్దాం'అంటూ రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రపంచ వ్యాపార, పారిశ్రామిక, సాంకేతిక రంగాల ప్రతినిధులకు పిలుపు నిచ్చారు. నైపుణ్యం కలిగిన

-మిగతా 2 లో..



## సన్న వడ్లకు బోనస్‌లో
# కీలక మార్పులు

### ప్రభుత్వం నిర్దేశించిన 7 రకాలకే బోనస్

హైదరాబాద్, ఆగస్ట్ 22 : తెలంగాణ ప్రభుత్వం సన్న వడ్లకు సంబంధించి క్వింటాకు 500 రూపాయల బోనస్ పథకంలో కీలక మార్పులు తీసుకొచ్చింది. అక్రమాలను అరికట్టి నిజమైన లబ్ధిదారులకు మేలు చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. అయితే కొత్తగా విధించిన నిబంధనలు క్షేత్రస్థాయిలో రైతులకు తీవ్ర అయోమయాన్ని, ఆందోళనను కలిగిస్తున్నాయి. ఈ బోనస్

-మిగతా 2 లో..

## లంకె బిందెల కోసం
# గుంత తవ్వారా?

### సచివాలయం ముందు పెద్ద గుంత
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లు

హైదరాబాద్‌లోని రోడ్ల దుస్థితికి సంబంధించిన ఓ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఏకంగా తెలంగాణ సచివాలయం ముందే పెద్ద గుంత తవ్వి అలాగే వదిలేయడంపై ఓ నెటిజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ భారీ గుంతను చూపిస్తూ ఎక్స్‌లో చేసిన పోస్టుపై ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ పోస్టుపై స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. రేవంత్ సర్కార్‌పై సెటైర్లు వేశారు. సెక్రటేరియట్ ముందే ఇంత పెద్ద గుంత ఉంది. ఎవరైనా సెక్రటేరియట్ చూసుకుంటూ వస్తే ఈ గుంతలో పడి ఛస్తారని ఆందోళన వ్యక్తం చేశాడు.

04






### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## మానవీయ కోణంలో
# అమలవుతున్న రేషన్ పథకం

### సన్నబియ్యంతో పేదలకు కడుపునిండా తిండి
### కేంద్రం దేశవ్యాప్తంగా ఈ ప థకం అమలు చేయాలి
### స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో కడియం శ్రీహరి

జనగామ, ఆగస్ట్ 22 : మానవీయ కోణంలో అమలు చేస్తున్న గొప్ప పథకం సన్న బియ్యం పంపిణి పథకం అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. దేశంలోనే మొట్ట మొదటి సారిగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కోటి 06లక్షల రేషన్ కార్డుల ద్వారా 3కోట్ల 10లక్షల మందికి ఉచిత సన్న బియ్యం పంపిణి జరుగుతందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పేద ప్రజల. పట్ల ప్రేమ ఉంటే దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణి చేయాలన్నారు. బడా వ్యాపారవేత్తలకు వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తారు కానీ పేద ప్రజలకు కడుపు నిండా అన్నం పెట్టరని

-మిగతా 2 లో..



## పూర్తిస్తాయి వైద్య కేంద్రాలుగా
# కమ్యూనిటీ ఆస్పత్రులు

### టీచింగ్ హాస్పిటళ్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ
### వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్, ఆగస్ట్ 22 : ఆయా కమ్యూనిటీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులను పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వ్యాఖ్యానించారు. జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లోనూ మేజర్ సర్జరీలు అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. శనివారం సచివాలయంలో మీడియాతో మంత్రి దామోదర్ మాట్లాడారు. టీచింగ్ హాస్పిటళ్లలో

-మిగతా 2 లో..





గచ్చిబౌలిలో కుప్పకూలిన
# ఏడంతస్తుల భవనం

04

ఇద్దరు మృతి.. మరొకరికి తీవ్ర గామాలు

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఓట్లు అడగం




(మొదటిపేజీ తరువాయి)

అంజేయడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ, మరియు గృహనిర్మాణ అంశాల మీద అధికారుతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ షాపింగ్ కాంప్లెక్స్ లో గంగస్థాన్ ఫేజ్ 2 భవనానికి ప్రారంభోత్సవం చేయడం జరిగింది. నిజామాబాద్ జిల్లాలోని వివిధ మండలాలకు మంజూరైన నూతన తహసీల్దార్ కార్యాలయాల భవనాలతో పాటు నిజామాబాద్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి మరియు గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 6 అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు భూమి పూజ చేయడం జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలో సంవత్సరానికి 2 లక్షల చొప్పున ఇండ్లు కట్టి ఉంటే పదేండ్లలో 20లక్షల ఇండ్లు పూర్తి అయ్యేవి. కేవలం 60 వేల ఇండ్లను మాత్రమే పూర్తి చేసింది. 30వేల ఇండ్లను మొండిగోడలతో అసంపూర్తిగా వదిలేసేసింది. నిజామాబాద్ టౌన్ లో కూడ సుమారు 400 ఇండ్లను అసంపూర్తిగా వదిలేస్తే, ప్రజాప్రభుత్వం వచ్చాక వాటికి నిధులు కేటాయించి నివాసయోగ్యానికి అనుకూలంగా ఉండేలా యుద్ధ ప్రతిపాదికన పనులు పూర్తి చేసి, డ్రా పద్ధతిలో అర్హులైన పేదలకు ఇండ్లను కేటాయించడం జరిగింది. అదేవిధంగా మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ. 3 కోట్ల 72 లక్షల 65 వేల చెక్కు అందజేశాము. రాబోయే 20 రోజుల్లో నిజామాబాద్ టౌన్ లో పైలట్ ప్రాజెక్ట్ కింద హైదరాబాద్ తరహా ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణాలు శ్రీకారం చుట్టబోతున్నాం. సొంత జాగలేని అర్హులైన నిరుపేదలకు తప్పకుండా ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని అన్నారు. ఇక సిమెంట్ బస్తా ధర 330 వరకు ఉంది. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారికి అది భారంగా కాకుడదు అనే ఆలోచనతో ప్రజాప్రభుత్వం సిమెంట్ పరిశ్రమల యాజమాన్యంతో మాట్లాడి, ఒప్పించి 230 రూపాయలకే సిమెంట్ బస్తా అందించేలా ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రతి జిల్లాలో 70 గ్రామాల చొప్పున సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామం, సర్వే సందర్భంగా ప్రజల అభిప్రాయాలను కూడా సేకరిస్తున్నాం, వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపడతాం అన్నారు. పేదలకు కేటాయించే ఇంటి స్థలాలు భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు గురికాకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే భూముల సర్వే నిర్వహిస్తున్నాం.నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో నూతనంగా నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తో కలిసి పిసిసి చీఫ్ మహేధ్ గౌడ్ పాల్గొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు, ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతున్నామని పిసిసి చీఫ్ తెలిపారు. కొత్త తరగతి గదులతో విద్యార్థులకు మరింత మెరుగైన, అనుకూలమైన విద్యా వాతావరణం అందుబాటులోకి రానుంది. కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి గారు, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, మేయర్ శ్రీమతి ఉమారాణి , డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి , బొబ్బిలి రామకృష్ణ , కవిత, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో విద్యా,పరిశోధనలకు
# కేంబ్రిడ్జ్ సహకారం

(మొదటిపేజీ తరువాయి)

పరిశోధన, ఆవిష్కరణలకు ఉన్న అవకాశాలపై కేంబ్రిడ్జ్ విద్యావేత్తలు సానుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, భాగస్వామ్యాన్ని ఆచరణలోకి తీసుకురావాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. ఈ భాగస్వామ్యం ద్వారా హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, స్టార్టప్ హబ్‌గా అభివృద్ధి చేయడంతో పాటు తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు మరింత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.



# 22ఏ నిషేధిత భూముల పేరిట అక్రమాలు

(మొదటిపేజీ తరువాయి)

అది లక్షలాది ఎకరాలకు చేరిందని విమర్శించారు. హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాత్రికి రాత్రే ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్న భూములను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారు? ప్రజల వ్యతిరేకతను తప్పించుకోవడం కోసం సీఎం ఇంటిని నిషేధిత జాబితాలో చేర్చారా? ధరణి స్థానంలో వచ్చిన భూభారతి నవ్వులపాలైంది. బీఆర్ఎస్ 10శాతం కమిషన్ తీసుకుంటే.. కాంగ్రెస్ 30 శాతం తీసుకుంటోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఓపెన్ భూములను అమ్మాలని చూస్తున్నారు. ప్రైవేటు భూముల్లో 50శాతం కమిషన్ అడుగుతున్నారు. ప్రభుత్వ భూముల్ని ఎందుకు అమ్ముతున్నారో సమాధానం చెప్పాలి. రియల్ ఎస్టేట్ కంపెనీలను బెదిరించి వాటాలు తీసుకుంటున్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక ఈ భూములపై మళ్లీ పరిశీలన చేస్తాం. ఎమ్మెల్యేకు ఇష్టంలేకపోతే ఆ భూమి 22ఏలోకి వెళ్లిపోతుంది. ఈ భూముల విషయంలో భాజపా లీగల్ సెల్ ప్రజలకు సహాయం అందిస్తోంది. ప్రాముఖ్యతను బట్టి ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తారు. విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ హయాంలో ఉన్న నిబంధనలే ఇప్పుడూ ఉన్నాయని కిషన్ రెడ్డి అన్నారు.

# పూర్తిస్తాయి వైద్య కేంద్రాలుగా కమ్యూనిటీ ఆస్పత్రులు

(మొదటిపేజీ తరువాయి)

607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. జిల్లా, ఏరియా ఆస్పత్రులు, 1,616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను నియమిస్తామని చెప్పారు. చిన్న సమస్యలకే పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేయొద్దని ఆదేశించారు. అవసరమైతేనే పేషెంట్లను పై స్థాయి ఆస్పత్రులకు రిఫర్ చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. అత్యవసర రిఫరల్‌కు ముందు సంబంధిత ఆస్పత్రికి సమాచారం ఇవ్వాలని సలహా ఇచ్చారు. అవసరమున్న ఆస్పత్రుల్లో కొత్త సీటీ స్కాన్లు, వైద్య పరికరాలను అందుబాటులో ఉంచుతామని అన్నారు. పరికరాల ప్రతిపాదనలకు రోగుల సంఖ్య, అవసరంపై జస్టిఫికేషన్ తప్పనిసరని చెప్పారు. డీసీహెచ్ఎస్‌లు వారానికి కనీసం ఒకరోజు ఆకస్మిక తనిఖీలు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. డీసీహెచ్ఎస్‌లు విధులకు గైర్హాజరు, విధుల నుంచి ముందే వెళ్లిపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయా ఆస్పత్రుల్లో సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని అన్నారు. పరిశుభ్రత, తాగునీరు, బయోమెడికల్ వేస్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రతి నెలా డీసీహెచ్ఎస్‌ల వర్క్ రిపోర్ట్ ప్రభుత్వానికి సమర్పించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.



# సన్న వడ్లకు బోనస్‌లో కీలక మార్పులు

(మొదటిపేజీ తరువాయి)

సొమ్ము అందాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశించిన 7 రకాల సన్న వరి విత్తనాలను మాత్రమే సాగు చేసి ఉండాలి. అందులో ఆర్ఎస్ఆర్ 15048 (తెలంగాణ సోనా), కేఎన్ఎం 1638 (కూనారం వరి-2), జైశ్రీరామ్, కేఎన్ఎం 7715, బీపీటీ 5204 (సాంబమసూరు), హెచ్ఎంటీ సోనా, డబ్ల్యూజీఎల్-44 (సిద్ధి) రకాలు ఉన్నాయి. రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాలకు వెళ్లి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, కొనుగోలు బిల్లు సమర్పించి సెప్టెంబర్ 10వ తేదీలోగా తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారులు ఆదేశించారు. నెల రోజుల కిందటే విత్తనాలు కొనుగోలు చేసినందున ఇప్పుడు పాత బిల్లులు దొరకక, దుకాణాల చుట్టూ తిరగలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలాచోట్ల వ్యాపారుల వద్ద రికార్డులు లేకపోవడంతో వాగ్వాదాలు జరుగుతున్నాయి. మరోవైపు మార్కెట్లో లభించే ఇతర రకాల సన్న వరిని సాగు చేసిన రైతులు తమకు బోనస్ వర్తించకపోవడంపై నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సొంతంగా విత్తనాలు ఉత్పత్తి చేసుకుని సాగు చేసిన రైతులు కూడా ఏ దుకాణంలో నమోదు చేసుకోవాలో తెలియక గందరగోళానికి గురయ్యారు. ఈ సమస్యపై స్పందించిన జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి స్పష్టతనిచ్చారు. సొంత విత్తనాలు వాడిన రైతులు దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, స్థానిక వ్యవసాయ అధికారులకు సొంత డిక్లరేషన్ రాసి ఇస్తే సరిపోతుందని తెలిపారు. సెప్టెంబర్ 10 లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. కామారెడ్డి జిల్లాలోనే దాదాపు 2.51 లక్షల ఎకరాల్లో సన్న రకాలు సాగవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిబంధనలను మరింత సులభతరం చేయాలని రైతాంగం కోరుతోంది.

# మానవీయ కోణంలో అమలవుతున్న రేషన్ పథకం

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణి చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ప్రజా సంక్షేమ పథకాలను చూసి బిఆర్ఎస్ ఓర్వలేక పోతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ నాయకులు దుర్మార్గంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. ఎన్నికలు ఏవైనా నిజాయితీగా ఉండే వారిని, ప్రజల కోసం పని చేసే వారిని ఎన్నుకుంటేనే గ్రామంలో అయినా, నియోజకవర్గంలో అయినా అభివృద్ధి జరుగుతుందని కడియం శ్రీహరి సూచించారు.. వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదికలో, ధర్మసాగర్ మండల కేంద్రంలోని సుస్మిత గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన వేలేరు, ధర్మసాగర్ మండలాలకు సంబందించిన కొత్త డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అత్యంత భద్రతా ప్రమాణాలతో జారీ చేసిన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణి చేశారు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుర్మార్గంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. రెండు రోజుల క్రితం ఎక్కడో ఆదిలాబాద్ లో సంజీవ రెడ్డి అనే వ్యక్తికి ఇతర కాంగ్రెస్ నాయకులకు గొడవ జరిగితే అది కడియం శ్రీహరిపైనే జరిగింది అని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఇంత దుర్మార్గంగా అబద్ధపు వార్తలు చేయడం బిఆర్ఎస్ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కొన్ని యూట్యూబ్ ఛానల్స్ కొని నెల జీతాలు ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, నాయకులపై సంబంధంలేని, సబ్జెక్ట్ లేని వార్తలతో విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది సరైన పద్ధతి కాదని సూచించారు. నా 35ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ ఎవరి దగ్గర రూపాయి అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం, పేద ప్రజల సంక్షేమం కోసమే నిరంతరం కృషి చేస్తున్నాని తెలిపారు. దేశంలోనే మొట్ట మొదటి సారిగా సన్న బియ్యంతో పాటు స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులు పంపిణి చేసిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం మాత్రమే అని చెప్పారు. తెలంగాణ చేపట్టిన సన్న బియ్యం పంపిణి కార్యక్రమం ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. ఏడాదికి 13వేల 800కోట్ల ఖర్చుతో కోటి 06లక్షల రేషన్ కార్డుల ద్వారా 3కోట్ల 10లక్షల మందికి ఒక్కరికి 6కిలోల చొప్పున ఉచిత సన్న బియ్యం పంపిణి చెస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యున్నత భద్రతా ప్రమాణాలతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా డిజిటల్ రేషన్ కార్డులను పంపిణి చేస్తుందని అన్నారు. ఈ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలని బీజేపీ వాళ్ళు అంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డు బియ్యం ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సన్న బియ్యం పంపిణి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల ఖర్చుతో చేపట్టే కార్యక్రమానికి మోడీ ఫోటో ఎలా పెడతారని ప్రశ్నించారు. పేద ప్రజల కడుపు నింపాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఉంటే దేశ వ్యాప్తంగా సన్న బియ్యం పంపిణి చేయాలని డిమాండ్ చేశారు. బడా బడా వ్యాపారవేత్తలకు వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తారు కానీ పేద ప్రజలకు కడుపు నిండా అన్నం పెట్టారని ఇది మంచి పద్ధతి కాదని విమర్శించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. పేద ప్రజల పక్షాన, రైతుల పక్షాన, మహిళల పక్షాన నిలబడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు. వేలేరు మండలంలో మూడు ప్రధాన సమస్యలు ఉన్నాయని అన్నారు. అందులో మొదటిది మల్లన్న గండి రిజర్వాయర్ నుండి సాగు నీరు అందించాలని చెప్పారు. మల్లన్న గండి లిఫ్ట్-1 పనులు వేగంగా జరుగుతున్నాయని అతి త్వరలోనే వేలేరుకు గోదావరి జలాలు తీసుకువస్తానని తెలిపారు. కొత్త మండలంలో మండల కార్యాలయాలు నిర్మాణం చేయాల్సి ఉందని ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయం నిర్మాణానికి 2కోట్ల 25లక్షలు మంజూరు అయ్యాయని, రెండు మూడు రోజుల్లో ఎంపీడివో కార్యాలయానికి మరో 2కోట్లు మంజూరు కానున్నాయని అన్నారు. నెల రోజులలోపు మండల కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తానని వెల్లడించారు. వేలేరు నుండి కొమ్ముగుట్ట వరకు రోడ్డు అభివృద్ధికి పంచాయతీ రాజ్ హ్యామ్ పథకం ద్వారా 14కోట్లు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులు పూర్తి చేయిస్తానని తెలిపారు. అలాగే వేలేరు మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న ప్రధాన రహదారిని పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. వేలేరుకు సాగు నీరు తీసుకురాలేకపోయినా, మండల కార్యాలయాలు నిర్మాణం చేయకపోయినా, రోడ్డు పనులు పూర్తి చేయకపోయినా మళ్ళీ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయమని అడగనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వేలేరు, ధర్మసాగర్ మండలాల సర్పంచులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు..

# ఆర్ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్‌తో యూరియాకు కొరత

## తక్షణం జోక్యం చేసుకోవాలన్న మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) షట్‌డౌన్‌పై తక్షణమే జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. దీని వల్ల సుమారు 10 రోజుల పాటు యూరియా ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో యూరియా డిమాండ్ అధికంగా ఉన్న వేళ ఈ షట్‌డౌన్ ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు మంత్రి తుమ్మల లేఖ రాశారు. గత ఖరీఫ్ సీజన్‌లో112 రోజుల పాటు ఆర్ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తి నిలిపి వేశారని గుర్తు చేశారు. ఈ సంస్థ తరచూ షట్‌డౌన్ కారణంగా రాష్ట్రంలో యూరియా సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్ఎఫ్ఎస్ ద్వారా రైతులకు యూరియా అందించడంలో ఆర్ఎఫ్‌సీఎల్ కీలకమని ఆ లేఖలో స్పష్టం చేశారు. ప్రస్తుతం షట్‌డౌన్‌ను త్వరగా ముగించి యూరియా ఉత్పత్తిని పునరుద్ధరించాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని ఆయన కోరారు. ఆర్ఎఫ్‌సీఎల్ లోటును ఇతర దేశీయ ఎ÷-లాంట్లు, దిగుమతుల ద్వారా భర్తీ చేయాలని కేంద్రానికి ఆయన విన్నవించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ముందస్తుగా తగినంత యూరియా నిల్వలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. నేటి (ఆగస్టు 22) నుంచి రామగుండం ఎరువుల కర్మాగారాన్ని షట్‌డౌన్ చేసిన సంగతి తెలిసిందే.

సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీరియస్

# కాంగ్రెస్‌కు నష్టం కలుగుతుంటే ఊరుకోం

## హెచ్చరించిన పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

**హైదరాబాద్,ఆగస్ట్22 :** మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత సీఎం రేవంత్‌రెడ్డిపై ఇటీవల చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ హై కమాండ్ సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే సుస్మిత వ్యాఖ్యల వీడియోను కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి నష్టం కలుగుతుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కొండా సుస్మిత లైన్ దాటి ఆరోపణలు చేశారని అన్నారు. అనిరుధ్, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి హద్దు మీరలేదని చెప్పారు. పార్టీ లైన్ ఎవరు దాటినా చర్యలు తప్పవని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. కొండా సురేఖ విషయంలో మరోసారి సమావేశం నిర్వహిస్తామని క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి పేర్కొన్నారు. కొండా సురేఖ వివరణ చదివామని తెలిపారు. కొండా సుస్మిత మాటల వీడియోలను చూశామని చెప్పారు. ముఖ్యమంత్రిపై సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. మంత్రి సురేఖ వివరణపై మరోసారి సమావేశం కావాలని భావించామన్నారు. క్రమశిక్షణ కమిటీకి మరి కొందరు ఎమ్మెల్యేలు మరిన్ని వివరాలు ఇస్తామన్నారని చెప్పారు. అలాగే, చిన్నారెడ్డి వివరణ లేఖ చదివామని మల్లు రవి అన్నారు. చిన్నారెడ్డి వ్యాఖ్యల వీడియోలు చూశామని తెలిపారు. చిన్నారెడ్డి విషయంలో ఎమ్మెల్యే మేఘారెడ్డితో మాట్లాడతామని అన్నారు. చిన్నారెడ్డి వ్యాఖ్యలకు, మేఘారెడ్డి ఫిర్యాదుకు చాలా అంతరం ఉందని చెప్పారు.

# పెట్టుబడులకు తెలంగాణాని వేదికగా ఎంచుకోండి

(మొదటిపేజీ తరువాయి)

మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, నవకల్పనకు వెన్నుదన్నుగా నిలిచే యువశక్తి, పెట్టుబడులకు వేగంగా స్పందించే పారదర్శక ప్రభుత్వం ఈ నాలుగు బలమైన స్తంభాలపై తెలంగాణ ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వం కలిగిన పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో శనివారం జరిగిన 'గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అండ్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్-2026'లో ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యోపన్యాసం చేశారు. కేవలం గణాంకాల్లో కనిపించే ఆర్థిక వృద్ధి మాత్రమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం, యు-ంవతకు ఉపాధి కల్పించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, భవిష్యత్ తరాలకు సుస్థిరమైన అభివృద్ధి పునాదులు నిర్మించడం తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 2025-26లో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి సుమారు రూ.17.82 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ స్థాయిలో నామమాత్రపు వృద్ధి రేటు 8 శాతంగా ఉండగా, తెలంగాణ 10.7 శాతం వృద్ధి నమోదు చేయడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోని అంతర్గత శక్తికి, విస్తరిస్తున్న అవకాశాలకు నిదర్శనమన్నారు. ఈ వృద్ధిని మరింత వేగవంతం చేస్తూ తెలంగాణను దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తుల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్?2047' దార్శనిక ప్రణాళిక రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దిశానిర్దేశర చేస్తోందని ఉత్తమ్ పేర్కొన్నారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్న మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇది కేవలం భారీ ఆర్థిక లక్ష్యం మాత్రమే కాదని, సంపద సృష్టితోపాటు ఆ సంపద ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా సమ్మిళిత అభివృద్ధిని సాధించాలన్న సంకల్పమని వివరించారు. ఈ లక్ష్యసాధన కోసం రాష్ట్రాన్ని పరస్పరం అనుసంధానమైన మూడు ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే వ్యూహాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని తెలిపారు. టెక్నాలజీ, అత్యున్నత విలువ కలిగిన పరిశ్రమలు, సేవారంగాలకు కేంద్రంగా పట్టణ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దే అజఖీఇ, నగర పరిసర ప్రాంతాల్లో తయారీ, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాలను విస్తరించే ఖజఖీఇ, వ్యవసాయం, ఆహార శుద్ధి, గ్రామీణ పారిశ్రామిక రంగాలకు కొత్త జీవం పోసే ఖీంఖీఇ?ఈ మూడు ప్రాంతాలు తెలంగాణ సమగ్ర ఆర్థిక పురోగతికి పరస్పర పూరక శక్తులుగా నిలుస్తాయని వివరించారు. అభివృద్ధి హైదరాబాద్ చుట్టూ గీసుకున్న సరిహద్దుల్లో ఆగిపోకూడదు. అది ప్రతి జిల్లాకు చేరాలి... ప్రతి పట్టణాన్ని తాకాలి... ప్రతి గ్రామంలో కనిపించాలి... ప్రతి తెలంగాణ కుటుంబం జీవితంలో మార్పుగా ప్రతిఫలించాలి' అని ఉత్తమ్ స్పష్టం చేశారు. ఆర్థికాభివృద్ధికి నిజమైన అర్థం రావాలంటే అవకాశాలు కొద్ది ప్రాంతాలకు, కొద్ది వర్గాలకు పరిమితం కాకుండా రాష్ట్రం నలుమూలలా విస్తరించాలన్నారు. హైదరాబాద్ ఇప్పటికే సమాచార సాంకేతికత, కృత్రిమ మేధ, ఔషధ తయారీ, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు అంతర్జాతీయ కేంద్రంగా తనదైన ముద్ర వేసిందని మంత్రి పేర్కొన్నారు. ఈ బలమైన పునాదిపై సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం, ఎలక్ట్రిక్ మొబిలిటీ, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగాల్లో అపారమైన పెట్టుబడి అవకాశాలు ఆవిష్కృతమవుతున్నాయని చెప్పారు. ప్రపంచ వ్యాపార సంస్థలు తెలంగాణను కేవలం మార్కెట్‌గా కాకుండా పరిశోధన, ఆవిష్కరణ, ఉత్పత్తి, ప్రపంచ మార్కెట్లకు విస్తరణకు వ్యూహాత్మక కేంద్రంగా చూడాలని కోరారు. తాను నిర్వహిస్తున్న నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖల పరిధిని ప్రస్తావిస్తూ నీరు?వ్యవసాయం?ఆహార భద్రత?పరిశ్రమల మధ్య ఏర్పడుతున్న అనుసంధానం భవిష్యత్ పెట్టుబడులకు మరో విశాలమైన ద్వారం తెరుస్తోందని ఉత్తమ్ చెప్పారు. సాగునీటి నిర్వహణను మరింత శాస్త్రీయంగా, సమర్థవంతంగా మార్చేందుకు ఉపగ్రహ చిత్రాలు, కృత్రిమ మేధ, డ్రోన్లు, సెన్సర్లు, ప్రిడిక్టివ్ అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే రంగాల్లో పెట్టుబడులను తెలంగాణ స్వాగతిస్తోందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం నీటి ప్రతి చుక్కను మరింత విలువైనదిగా మార్చగలదని, రైతుకు మరింత భరోసా కల్పించగలదని పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులను కేవలం ముడిసరుకుగా బయటకు పంపే పరిస్థితి నుంచి రాష్ట్రంలోనే శుద్ధి చేసి, విలువ జోడించి, బ్రాండ్‌గా తీర్చిదిద్ది, ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేసే స్థాయికి తీసుకెళ్లాలని మంత్రి ఆకాంక్షించారు. అందుకోసం ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ చైన్లు, గిడ్డంగులు, వ్యవసాయ లాజిస్టిక్స్, ప్యాకేజింగ్, ఎగుమతుల రంగాల్లో భారీ పెట్టుబడులకు అవకాశం ఉందన్నారు. వ్యవసాయానికి పరిశ్రమను అనుసంధానించడం ద్వారా రైతుకు మెరుగైన ధర లభించడంతోపాటు గ్రామీణ యువతకు వారి ప్రాంతాల్లోనే ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని చెప్పారు. పెట్టుబడిదారులు హైదరాబాద్‌ను దాటి తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాలు, అభివృద్ధి కేంద్రాల వైపు కూడా దృష్టి సారించాలని ఉత్తమ్ కోరారు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్ వంటి నగరాలు భవిష్యత్ పారిశ్రామిక, సేవా, లాజిస్టిక్స్, ఆహార శుద్ధి కేంద్రాలుగా ఎదగగల అపార సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని చెప్పారు. పెట్టుబడులు జిల్లాలకు విస్తరించినప్పుడే స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని, ప్రాంతీయ అసమానతలు తగ్గుతాయని, అభివృద్ధి నిజమైన అర్థంలో ప్రజాస్వామ్యీకరణ చెందుతుందని పేర్కొన్నారు. స్టార్టప్‌లు, గ్రామీణ ఆవిష్కర్తలను ప్రోత్సహిస్తున్న డాక్టర్ జె.ఎ. చౌదరి, ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ కృషిని మంత్రి అభినందించారు. వ్యాపార విజయాన్ని కేవలం ఆదాయం, లాభాలు, కంపెనీల విలువలతో కొలిచే కాలాన్ని దాటి ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

# అక్రమ నిర్మాణాలు తొలగిస్తాం

- అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మాణాదారులను ఎవ్వరినీ వదలం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ



**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** అంజయ్యనగర్‌లోని అక్రమ నిర్మాణాలన్నీ తొలగిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలపై ఎవరినీ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఘటనాస్థలి పక్కన భవనాల వారు ఖాళీ చేసి వెళ్లాలని రంగనాథ్ ఆదేశించారు. గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన విషయం తెలియడంతో అక్కడకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ చేరుకుని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఇద్దరు మృతిచెందారని రంగనాథ్ తెలిపారు. బిల్డింగ్ యజమాని ఇంకా అందుబాటులోకి రాలేదని అన్నారు. ఈ బిల్డింగ్ నిర్మాణంపై సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్‌కి కొంతమంది ఫిర్యాదు చేశారని వెల్లడించారు. గతంలో హైడ్రాకు ఈ బిల్డింగ్ నిర్మాణంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు. ఏడు అంతస్తులు, ఒక పెంట్ హౌస్ మొత్తం ఎనిమిది అంతస్తుల బిల్డింగ్‌ను నిర్మిస్తున్నారని వివరించారు. నాలాను అతిక్రమించి ఈ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోందని రంగనాథ్ అన్నారు. చుట్టుపక్కల ఉన్న భవనాలను పరిశీలించి త్వరలోనే కూల్చివేస్తామని తెలిపారు. బిల్డర్ సాజిద్ 50 గజాల్లో భవనాలు కట్టి హాస్టళ్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. సాజిద్ పరారీలో ఉన్నారని చెప్పారు. 50 గజాల్లో ఈ బిల్డింగ్ నిర్మించారని వెల్లడించారు. హాస్టల్ బిల్డింగులను నిర్మించి.... రెంట్‌కు ఇస్తుంటాడని చెప్పారు. హైడ్రా ఈ ఘటన సహాయక చర్యల్లో పాల్గొంటుందని.... ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. శిథిలాల కింద అదృష్టవశాత్తూ ఇంకెవరూ ఉండకపోవచ్చని భావిస్తున్నామని రంగనాథ్ పేర్కొన్నారు. అలాగే, ఈ ఘటన గురించి సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మాట్లాడారు. గతంలోనే ఈ నిర్మాణాలపై తమకు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. నాలుగు నెలల క్రితమే ఈ నిర్మాణ పనులను ఆపేసి, సీజ్ చేశామని వెల్లడించారు. మళ్లీ నిన్న వర్క్ మొదలుపెట్టారని చెప్పారు. ఈరోజు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమయ్యామని అన్నారు. ఈ లోపు ఈ ప్రమాదం చోటు చేసుకుందని చెప్పారు. ఈ నాలాను ఆక్రమించి నిర్మాణలు చేస్తున్నారన్నారు. ఈ బిల్డింగ్ చుట్టూ చాలా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని అన్నారు. హాస్టల్ బిల్డింగ్ కోసం ఈ నిర్మాణాన్ని చేపట్టారని సృజన తెలిపారు.

## రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం మోకాలడ్డు

**సిఎం అమెరికా పర్యటన తిరస్కరించడం నిరంకుశం**

**మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు**



**సిద్దిపేట, ఆగస్ట్ 22 :** తెలంగాణ అభివృ ద్ధికి కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందంటూ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విదేశీ పర్యటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్తే అనుమతి నిరాకరిం చడం కేంద్రం నిరంకుశత్వానికి నిదర్శ నమని మండిపడ్డారు. ఈ సంద ర్భంగా కేంద్రం తీరుపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. దీనిపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పల్లె పల్లెలెకు పొన్నం అన్న- ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో మంత్రి పొన్నం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెబుతున్న 'వికసిత్ భారత్- 2047' లక్ష్యం నెరవేరాలంటే ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణకు న్యాయంగా రావాల్సిన ఆర్థిక సహకారం, నిధుల విషయంలో కేంద్రం సానుకూలంగా వ్యవహరించాలని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల కోసం రాష్ట్ర బీజేపీ నాయకులు ఎందుకు గళమెత్తడం లేదని మంత్రి ప్రశ్నించారు. కేంద్రం పక్క రాష్ట్రాలకు నిధులు ఇస్తున్నప్పుడు తెలంగాణకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని వారిని సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. అదే విధంగా కేంద్రం కూడా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం 'ప్లలె ప్లలెకు పొన్నం అన్న- ప్లలె ప్లలెలో ప్రజా పాలన' కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రజలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మంత్రి పొన్నం వెల్లడించారు.

## కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏనాడు మాట్లాడలేదు: చిన్నారెడ్డి

**హైదరాబాద్,ఆగస్ట్22 :** వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ ఇచ్చిన షోకాజ్ నోటీసులపై ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి స్పందించారు. తానేం తప్పుగా మాట్లాడలేదని లేఖలో పేర్కొన్నారు. 'ఏ రోజూ నేను పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడలేదు. ఎవరిపైనా అనుచిత వ్యాఖ్యలు చేయలేదు. రెండున్నరేళ్లుగా కార్యకర్తల ఆవేదనను వ్యక్తంచేశా. స్థానిక ఎమ్మెల్యే వ్యవహారం ఒంటెద్దుపోకడలా ఉంది. నేతలు, కార్యకర్తలు పడుతున్న ఆవేదననే తెలిపా. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడాలనే ఉద్దేశం నాకు లేదు. పార్టీకి నష్టం కలిగించేవారిని ప్రశ్నించడమే నా ఉద్దేశం. నాపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం. వాటిపై విచారణ జరిపి న్యాయం చేయాలి' అని లేఖలో పేర్కొన్నారు.

## నిషేధిత జాబితా పేరుతో వేధింపులు

**ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారం ఎక్కడిది**

**ఉప్పల్ బాధితులతో హరీష్ రావు**



**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములను కబ్జా చేసే హక్కు ఎవరు ఇచ్చారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇది 30శాతం కమిషన్ సర్కార్ అని ప్రజలే అంటున్నారని తెలిపారు. హైదరాబాద్ బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన వందలాది మంది 22ఎ బాధితులు వచ్చి తమ ఆవేదన చెబుతుంటే గుండె కలిచివేసిందని అన్నారు. సర్వే నంబర్ 215, 215 పార్ట్‌లలో 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22ఎ నిషేధిత జాబితాలో చేర్చడం అత్యంత దుర్మార్గమని హరీశ్‌రావు మండిపడ్డారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఇల్లు అమ్ముకుందామని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే.. ఆస్తి ప్రొహిబిషన్‌లో ఉందన్న విషయం తెలియడంతో కాలనీ వాసులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లను అడ్డుపెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తెచ్చి 30 శాతం కమిషన్లు దండుకునేందుకే ఇలాంటి కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా కోడై కూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలకు ఇప్పుడు 22ఎ భయం చూపిస్తూ, బినామీలతో సెటిల్మెంట్లు చేసుకునే దందాకు తెరలేపారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. దీనికి మీ సమాధానం ఏంటని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బోడుప్పల్ కాలనీ వాసులు సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బాధితులందరూ అధైర్యపడవద్దు. ఈ వసూళ్ల సర్కార్ మెడలు వంచైనా సరే మీ ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. మాటలు పక్కనబెట్టి, తక్షణమే ఆయా కాలనీలను 22ఎ నిషేధిత జాబితా నుంచి తొలగించి, బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే బాధితుల పక్షాన బీఆర్ఎస్ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు.



## రోడ్లు, బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలి

**అధికారులకు మంత్రి కోమటిరెడ్డి సూచన**

**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** రాష్ట్రంలో సీఆర్ఐఎఫ్ రోడ్లు, సేతుబంధన్, రైలు ఓవర్ బ్రిడ్జ్ పనుల్లో వేగం పెంచాలని ఉన్నతాధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. శనివారం సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల్లో నియోజకవర్గాల వారీగా పనుల పురోగతి మరింత మెరుగుపడాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 3,918 కి.మీ రోడ్లకు రూ.5,159 కోట్లతో 316 పనులు మంజూరు అయ్యాయని వివరించారు. 2025-26లో రూ.868 కోట్లతో 422.36 కి.మీ రోడ్ల పనులు చేపట్టామని తెలిపారు. హై లెవెల్ బ్రిడ్జిలు, పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. మిర్యాలగూడ, నంది పహాడ్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. నార్కట్‌పల్లి బ్రిడ్జి పనుల పురోగతిపై ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో మరింత కష్టపడి పని చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. డిసెంబర్ నాటికి సచివాలయంలో సోలార్ కార్ పార్కింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రూ.26.81 కోట్ల అంచనా వ్యయంతో సోలార్ కార్ పార్కింగ్ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. సోలార్ పార్కింగ్‌తో సచివాలయానికి 90 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వివరించారు. దీంతో నెల వారీ విద్యుత్ బిల్లులో 16 శాతం ఆదా అవుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు.

## రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధి ఖాజాగూడలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ సమీపంలో తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రాయదుర్గం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముగ్గురు యువకులు బైక్‌పై ఖాజాగూడ నుంచి గచ్చిబౌలి అంజయ్య నగర్‌వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో స్టాఫ్ ఇంజినీరింగ్ కాలేజ్ 2వ గేటు సమీపంలో కేర్ హాస్పిటల్ మె-యిన్ రోడ్డు వైపు మలుపు తీసుకుంటుండగా బైక్ అదుపుతప్పి కిందపడి పోయారు. ఈ ప్రమాదంలో పశ్చిమ్‌బెంగాల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అబ్బాస్ సిద్ధిక్ (25) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అదే రాష్ట్రానికి చెందిన బైక్ నడిపిన సహస్ర ఛటోపాధ్యాయ (25), వెనుక కూర్చున్న అభిజిత్ సింగ్ (25) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నారు. సిద్ధిక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## కాట్రాక్ కండక్టర్ల ఆందోళన

**ఉద్యోగాల తొలగింపుపై నిరసన**

**హనుమకొండ, ఆగస్ట్ 22 :** వరంగల్ రీజియన్ ఆర్టీసీలో ఏడాది నుంచి 90 మంది కండక్టర్లు కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. యాజమాన్యం ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రే విధుల నుంచి తొలగించింది. దీంతో వారు శనివారం హనుమకొండలోని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సంవత్సరం నుంచి తమతో విధులు చేయించుకుని, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీకి సంబంధించిన పలు కీలక సమయాల్లో మేడారం మహాజాతరను విజయవంతం చేయడంలో తమ పాత్ర ఎంతో ఉందని అన్నారు. అలా తమ సేవలను వినియోగించుకున్న తర్వాత అకస్మాత్తుగా ఉద్యోగాల నుంచి తొలగించడంతో తమ కుటుంబాలు ఇబ్బందుల్లో పడే పరిస్థితి ఏర్పడిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, తమ కుటుంబాలను రోడ్డున పడకుండా ప్రభుత్వం, ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్టీసీ సంస్థకు చెందిన కొన్ని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ లు తమను తీసుకుని ఇప్పుడు తొలగించడం అన్యాయమని, డబ్బులు ఇచ్చినవారిని తొలగించలేదని వాపోయారు. గత ఆర్ఎం-ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు కుమ్మక్కయ్యారని, డిసెంబర్ వరకు అగ్రిమెంట్ ఉన్నా కూడా చెప్పకుండా అకారణంగా తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీలు కొంతమంది వద్ద డబ్బులు తీసుకుని ఇప్పుడు తొలగించాలని, ఇందులో ముఖ్యంగా చంద్రశేఖర్ ఏజెన్సీ ఎక్కువ మందిని తీసుకున్నట్లు వారు ఆరోపించారు. డబ్బులు తీసుకుని నియమించిన ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల యజమానులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆర్ఎం భవానీప్రసాద్‌ను వివరణ కోరగా 'ఎవరైతే కాంట్రాక్ట్ పూర్తయిందో వారిని తొలిగించామని, వారిని తీసుకున్న ఏజెన్సీలను అడగాలని సమాధానం' ఇచ్చారు.



## పవర్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన భట్టి

**ఆధునికత సాంకేతికతపై ప్రదర్శన**

**హైదరాబాద్, ఆగస్ట్ 22 :** నగరంలోని నెక్లెస్ రోడ్‌లో పీపుల్స్ ప్లాజాలో పవర్ ఎగ్జిబిషన్-2026 ఘనంగా ప్రారంభమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో విద్యుత్ రంగంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికతల ను ప్రదర్శిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, వినియోగంలో చోటుచేసుకుంటున్న సాంకేతిక మార్పులను ప్రజలకు పరిచయం చేయడం ఈ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశంగా ఉంది. ఎగ్జిబిషన్‌లో విద్యుత్ భద్రతా చర్యలు, పునరుత్పాదక ఇంధన వనరులకు సంబంధించిన ప్రత్యేక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. స్మార్ట్ మీటరింగ్, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ఛార్జింగ్ వ్యవస్థలు వంటి నూతన సాంకేతికతలపై సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నారు.




## కాళేశ్వరంతో ఎలాంటి సమస్యలు లేవు

- వెంటనే నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలి
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి డిమాండ్

**సిరిసిల్ల, ఆగస్ట్ 22 :** తెలంగాణకు వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టులో బాగమైన అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి సమస్యలు లేవని కేంద్ర జల విద్యుత్ పరిశోధన సంస్థ క్లీన్‌చిట్ ఇచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నారం, సుందిళ్ల ఎక్సలెంట్, గుడ్ అని రిపోర్ట్ ఇచ్చిందని రిపోర్ట్ తో నైనా రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కళ్లు తెరవాలని హితవు పలికారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం లోకి తేవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎల్‌నినోతో రాబోయే పంట కాలంలో సాగు నీటి కి ఇబ్బందులు వస్తాయని హెచ్చరిస్తున్నాయని అన్నారు. రెండు నెలల క్రితమే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కన్నెపల్లి పంపు హౌజ్ ను సందర్శించి, సాగు నీరు, తాగు నీటికి వచ్చే ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వానికి సూచించా రని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం లోకి తెస్తే కేసీఆర్ కు పేరొస్తుందని ప్రభుత్వ భేషజాలకు పోతుందని విమర్శించారు. కన్నెపల్లి నుంచి వృథాగా దిగువన నీరు పోతున్నదని, చంద్రబాబు కోసం గురు దక్షణగా నీటిని రేవంత్ రెడ్డి అందజేస్తున్నారని విమర్శించారు. కన్నెపల్లి పంపు హౌజ్ వద్ద రూ.100 కోట్ల తో కాఫర్ డ్యాం కట్టి వినియోగంలోకి తేవాలని సూచించారు. కేసీఆర్ దూర దృష్టితో కాళేశ్వరం కట్టారని గుర్తు చేశారు.

## బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్

**2026 పోస్టర్ ఆవిష్కరించిన దిల్‌రాజు**

**హైదరాబాద్,ఆగస్ట్ 22 :** బతుకమ్మ పండగ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'యంగ్ ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్ 2026 - సీజన్ 2' పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబులతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిం, పాటల పోటీలు ఉంటాయన్నారు. ఈ సారి కొత్తగా జానపద పాటలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఇన్‌ఫ్లుయెన్సర్ల వీడియోస్, వ్యాసాలు (ఆర్టికల్స్) కు చోటు కల్పించారు. ఈ పోటీ యువ ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా మాట్లాడుతూ ఈ పోటీలు యువతకు భవిష్యత్తులో సినీ రంగంలో అవకాశాలను సృష్టిస్తాయని, సృజనాత్మక కంటెంట్‌కు వేదికగా నిలుస్తాయని తెలిపారు. తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి, పండగలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో ప్రాచుర్యం పొందేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయని అన్నారు. ఘు చిత్రాల నిడివి 3 నిమిషాలు, పాటల రన్‌టైమ్ 5 నిమిషాలకు మించకూడదు. ఆయా వీడియోలు 4కే రిజల్యూషన్ కలిగి ఉండాలి. ఆసక్తి కలిగిన వారు వాటిని 2026 సెప్టెంబర్15లోపు 8125834009 వాట్సాప్ నంబరుకు గానీ పంపాలి.

## మీడియా అకాడమీ కార్యకలాపాలు అభినందనీయం

**ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రశంసలు**

**హైదరాబాద్,ఆగస్ట్22 :** జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి నైపుణ్యాల పెంపు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు తెలంగాణ మీడియా అకాడమీ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని దేశంలోని పలు రాష్ట్రాలతో ఏర్పడ్డ ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు ప్రశంసించారు. ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధి బృందం శనివారం మధ్యాహ్నం తెలంగాణ మీడియా అకాడమీ భవనాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ప్రతినిధులకు అకాడమీ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అకాడమీ కార్యదర్శి నాగుళ్లపల్లి వెంకటేశ్వరరావు ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. సందర్భంగా జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అక్రిడిటేషన్ సేవలు, విధి నిర్వహణలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అందిస్తున్న రూ.1 లక్ష ఆర్థిక సహాయం, వారి పిల్లలకు అందిస్తున్న ట్యూషన్ ఫీజు సహాయం, అలాగే జర్నలిస్టు కుటుంబాలకు అందిస్తున్న ఇతర సంక్షేమ కార్యక్రమాలను ప్రతినిధులకు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం డెస్క్ జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తుండటం పట్ల ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులందరూ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 23,000 మందికి పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేస్తూ, జర్నలిస్టుల వృత్తిపరమైన గుర్తింపు మరియు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందించారు. శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనే జర్నలిస్టులకు ఉపయోగపడేలా అకాడమీ ప్రచురిస్తున్న మోనోగ్రాఫ్లు, పుస్తకాలు అందిస్తున్న విధానాన్ని కూడా ప్రతినిధులు పరిశీలించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్బుకు చెందిన నీలేష్ కాంతాహా, హరీష్ పగిడే, సంజయ్ మహతా (మధ్యప్రదేశ్), సోనాలి యాదవ్, దీపక్ మహేశ్వరీ, ఉదిత్ తండ్, ఉమాలీ తండ్, లక్షణ్ ఫండ్, యాష్ వర్ధన్ సింగ్, రచనా జోషి, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రెసిడెంట్ గౌతమ్ పహాని, డా. స్నేహాశిస్ సూర్, జనరల్ సెక్రటరీ సౌరభ్ దుగ్గల్, మెంబర్ అనిల్ సింగ్, సెక్రటరీ జనరల్ రాజేష్ ధల్, మెంబర్ రమేష్ హండా, ట్రెజరర్ నీరజ్ ఠాకూర్, వివేక్ ముఖర్జీ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ రెడ్డి, సెక్రటరీ రమేష్, ఏ. రాజేష్, మిడియా అకాడమీ మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, ఓ.ఎస్.డి. ఎమ్.కె. రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

# రూపాయి బియ్యంతో దళారుల దందా



ఉచిత రూపాయికే కిలో బియ్యం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పక్కదారి పడుతోంది. బియ్యం స్మార్ట్ కార్డులు అందచేసినా, చాలావరకు బియ్యం అక్కమంగా మార్కెట్‌కు తరలిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో టన్నుల కొద్ది బియ్యం పోర్టులు దాటిపోయాయి. తెలంగాణలో కూడా అదే విధంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ తరలించి నయాదందా తెరతీసారు. ఎన్టీఆర్ హాయంలో పేదలకు బియ్యం అందించాలని కిలో రెండు రూపాయలకే పథకం తెచ్చారు. అది పలు రూపాంతరాలు చెంది. ఉమ్మడి ఎపిలో కిరణ్ కుమార్ రెడ్డి సిఎంగా ఉండగా కిలో రూపాయికే అందిస్తున్నారు. దీని ధరలు పెంచడానికి ప్రభుత్వాలు జంకుతున్నాయి. ఎక్కడ ఓటు బ్యాంక్ పోతుందో అన్న భయంలో పాలకులు ఉన్నారు.

పేదవాడి కడుపు నింపాలనే సంకల్పంతో ప్రభుత్వాలు రూపాయి ఖర్చుకు వెనుకాడకుండా ఉచితంగా బియ్యం ఇస్తుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ లబ్ది అక్రమార్కుల పాలిట 'కాసుల పంట'గా మారుతోంది. రూపాయి లేకపోయినా పేదవాడు ఆకలితో అలమటించకూడదని ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం అందిస్తుంటే, ఆ పథకం ఆశయం కాస్తా దారి మళ్లుతోంది. ఉచిత బియ్యం అర్హులైన పేదల కడుపు నింపాల్సింది పోయి, బ్లాక్ మార్కెట్ వ్యాపారుల జేబులు నింపుతుండటం తీవ్ర విచారకరం. తినడానికి ఇచ్చే బియ్యం.. గడప దాటక ముందే విక్రయం జరుగుతోంది. వందలకోటల బిసినెస్ దీనివెనక నడుస్తోంది. ఈ రోజుల్లో చాలా చోట్ల రేషన్ కార్డు ఉండి, రేషన్ బియ్యాన్ని ఆహారంగా వాడుకోని వర్గాలు దాన్ని ఒక అదనపు ఆదాయ మార్గంగా మార్చుకుంటున్నాయి. ప్రతి నెల లేదా మూడు నెలల కోటా పంపిణీ మొదలవగానే లబ్దిదారుల ఇళ్ల ముందే దళారులు ప్రత్యక్షమవుతున్నారు. ప్రభుత్వం అందించిన నాణ్యమైన బియ్యాన్ని ఇంట్లో ఉంచుకోవాల్సిన పేదలు, కేవలం ఐదు–పది రూపాయల ఆశకు లోనై వ్యాపారులకు అమ్మేస్తున్నారు. మరికొన్ని చోట్ల దందా ఇంకొంచెం ముందుకెళ్లింది. అసలు బియ్యం సంచులను ఇళ్లకు కూడా తీసుకెళ్లడం లేదు. షాపు వద్దకు వెళ్లి వేలిముద్ర వేసి, బియ్యాన్ని అక్కడ వదిలేసి, కిలోకు రూ.10 నుండి రూ.15 తీసుకుని వెళ్లిపోతున్నారు. ఈ విధంగా మిగిలిపోయిన బియ్యాన్ని రేషన్ డీలర్లు, దళారులు చీకటి పడగానే గోదాములకు, పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇంకొన్ని రేషన్ షాపుల్లో డీలర్లు స్థానిక హోటళ్లకు అమ్మేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా.. బహిరంగ మార్కెట్లో వీటిని కేజీకి రూ.20 నుండి రూ.25 వరకు విక్రయిస్తూ అక్రమ సంపాదనకు అలవాటు పడుతున్నారు.

పేదవాడి ఆకలి తీర్చాలనే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం ఇక్కడ తీవ్రంగా నీరుగారిపోతోంది. ఈ దందాను అరికట్టేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు కఠినతరం చేసినా లాభం లేకుండా పోయింది. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే సన్నబియ్యాన్ని బయట మార్కెట్లో అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల అధికారులు హెచ్చరించడం షరామామూలుగా మారింది. దీంట్లో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పెద్దగా చొరవ చూపడం లేదు. దీంతో వ్యారం యధావిధిగా సాగుతోంది. చ్చరించారు. లబ్దిదారులు బియ్యం అమ్ముకున్నట్లు ఆధారాలతో సహా నిరూపణ అయితే వారి రేషన్ కార్డును శాశ్వతంగా రద్దు చేస్తారు. వరుసగా ఆరు నెలల పాటు రేషన్ సరుకులు తీసుకోని వారిని అనర్హులుగా గుర్తించి జాబితా నుంచి తొలగిస్తారు. ఆకస్మిక తనిఖీల్లో బియ్యం నిల్వల్లో తేడాలు వచ్చినా, రీసైక్లింగ్ దందాలో భాగస్వామ్యమైనా డీలర్ల లైసెన్సులను రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ఉచితంగా అందిస్తున్న ఆహార ధాన్యాలను కేవలం ఆకలి తీర్చుకోవడానికే ఉపయోగించాలి. వ్యాపార వస్తువుగా మార్చి చట్టపరమైన సమస్యల్లో చిక్కుకోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేసింది. ఇందులో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికీ రాబోయే 15 రోజుల్లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖను నేరుగా ప్రజల చెంతకు చేర్చాలనే తపనతోనే ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోంది. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని తినలేక రీసైక్లింగ్‌కు తరలించే దుస్థితి ఉండేదని, దానిని మారుస్తూ దేశంలోనే తొలిసారిగా తెల్ల రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.42 కోట్ల మంది పేదలు లబ్ది పొందుతున్నారు. గత పదేళ్లలో రేషన్ కార్డులు అందక ఇబ్బంది పడిన వారికి ఉపశమనం కలిగిస్తూ.. ప్రభుత్వం కొత్తగా 16 లక్షల కుటుంబాలను రేషన్ పరిధిలోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కుటుంబాలకు ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ఆహార భద్రత అందుతోంది. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావడానికి కూడా ఈ కార్డులు ఎంతో కీలకం కానున్నాయి. అయితే ప్రభుత్వాలు కఠిన చర్యలు తసీఉకోనంత వరకు ఈ దందా ఆగదు. అక్రమంగా తరలింపు కూడా ఆతదని పాలకులు గుర్తించాలి.

## లంకె బిందల కోసం గుంత తవ్వారా?

### సచివాలయం ముందు పెద్ద గుంత
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లు



**హైదరాబాద్, ఆగస్టు 22 :** హైదరాబాద్‌లోని రోడ్ల దుస్థితికి సంబంధించిన ఓ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఏకంగా తెలంగాణ సచివాలయం ముందే పెద్ద గుంత తవ్వి అలాగే వదిలేయడంపై ఓ నెటిజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ భారీ గుంతను చూపిస్తూ ఎక్స్‌లో చేసిన పోస్టుపై ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ పోస్టుపై స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. రేవంత్ సర్కార్‌పై సెటైర్లు వేశారు. సెక్రటేరియట్ ముందే ఇంత పెద్ద గుంత ఉంది. ఎవరైనా సెక్రటేరియట్ చూసుకుంటూ వస్తే ఈ గుంతలో పడి ఛస్తారని ఆందోళన వ్యక్తం చేశాడు. ఇంతమంది పోలీసులు వెళ్తుంటారు. ఇంతమంది జనాలు వెళ్తుంటారు.. అలాంటి చోట ఏంటి గుంత నా అని ప్రశ్నించారు. సీఎం గారూ హుస్సేన్ సాగర్‌ను ఇక్కడ కూడా పెట్టాలని అనుకుంటున్నారా? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. రోజూ ఎంతోమంది తిరుగుతుంటారు.. దీన్ని క్లోజ్ చేద్దామన్న రెస్పాన్సిబిలిటీ ఉండదా? జీహెచ్‌ఎంసీ వాళ్లు రోడ్లపై తిరుగుతూ చూడరా? అస్తమానం ఎవరో ఒకరు కంప్లయింట్ ఇస్తేనే తెలుస్తుందా? అని నిలదీశారు. వీలైనంత తొందరగా దీనిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. అంతేకాకుండా.. లోపల ఇలాంటివి చాలా ఉన్నాయ్.. లోపల దాచిపెట్టాం అని జీహెచ్‌ఎంసీ అన్నట్లుగా క్యాప్షన్ పెట్టాడు. పోస్టు వైరల్‌గా మారడంతో హైదరాబాద్ రోడ్ల పరిస్థితి, కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే కేటీఆర్ కూడా స్పందించారు. లంకెబిందెల కోసం తవ్వుతున్నారేమో అని వ్యంగ్యంగా కామెంట్ పెట్టారు. దీనికి నవ్వుతున్న ఎమోజీని కూడా జత చేశారు. దీంతో కేటీఆర్ కామెంట్ కూడా వైరల్‌గా మారింది.

## నాభర్తను విడిచి పెట్టండి

### బ్రిటన్‌కు భారతీయ నావికుడి భార్య వినతి

**న్యూఢిల్లీ, ఆగస్టు 22 :** రష్యా 'షాడో ఫ్లీట్'కు చెందినదిగా అనుమానిస్తున్న చమురు ట్యాంకర్‌పై ఇటీవల బ్రిటన్ దళాలు దాడి చేసి.. ఓ భారతీయుడిని అరెస్ట్ చేశాయి. ఈ ఘటనపై ఆ భారత నావికుడి భార్య మాట్లాడుతూ.. తన భర్తను బలిపశువును చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కేవలం తన యజమాని ఆదేశాలను మాత్రమే పాటించారని చెప్పారు. సదరు నౌక ఇంగ్లిష్ ఛానల్ మీదుగా ప్రయాణిస్తుండగా.. బ్రిటన్ కమాండోలు అందులోకి ప్రవేశించారు. నౌక కెప్టెన్‌గా ఉన్న 38ఏళ్ల అజయ్ పంత్‌ను అరెస్ట్ చేశారు. ఇటీవల అతడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ కేసులో అతడు గరిష్ఠంగా 10ఏళ్ల జైలు శిక్షను ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే అజయ్ భార్య రితూ పంత్ మీడియాతో మాట్లాడుతూ.. 'నౌక యజమాని వద్ద నా భర్త కేవలం ఓ ఉద్యోగి మాత్రమే. యాజమాన్యం ఎలా చెబితే అలాగే చేశారు. తాను చేసిన తప్పేంటో కూడా అర్థం కావట్లేదని ఆయన వాపోతున్నారు. చేయని తప్పునకు జైల్లో కుమిలిపోతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నౌకలో 98వేల టన్నుల చమురును అక్రమంగా రవాణా చేస్తున్నారన్నది బ్రిటన్ ఆరోపణ. నౌక కెప్టెన్‌గా కార్గోలో ఏముందో అజయ్ పంత్‌కు కచ్చితంగా తెలుసునని బ్రిటిష్ ప్రాసిక్యూషన్ కోర్టులో వాదించింది. అయితే, దీన్ని అజయ్ న్యాయవాది తోసిపుచ్చారు. కెప్టెన్ బాధ్యత కేవలం నౌకలోని కార్గోను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చడమేనని, అందులో ఏముందో వారికి తెలిసే అవకాశం లేదని అన్నారు. ఈ కేసుపై డిసెంబరు 15 నుంచి విచారణ జరగనుంది. మరోవైపు, కాన్సులార్ అనుమతితో బ్రిటన్ జైల్లో ఉన్న అజయ్ పంత్‌ను భారత విదేశాంగ శాఖ కలిసి ఘటన గురించి తెలుసుకుంది. జూన్ 14న ఈ ఘటన చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. కామెరూన్ జెండాతో ఉన్న చమురు ట్యాంకర్ 'స్కిట్రోస్'.. ఇంగ్లిష్ ఛానల్‌లో ప్రయాణిస్తున్న సమయం లో బ్రిటన్ సైనిక దళాలు అందులోకి ప్రవేశించాయి. 6 గంటల పాటు సాగిన ఈ ఆపరేషన్‌లో బ్రిటన్ రాయల్ మెరైన్ కమాండో లు, ఎన్‌సీఏ అధికారులు పాల్గొన్నారు. నౌకలో మొత్తం 24 మంది సిబ్బంది ఉండగా.. కెప్టెన్‌గా ఉన్న అజయ్‌ను బ్రిటన్ దళాలు అరెస్ట్ చేశాయి. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత విధించిన ఆంక్షలను తప్పించుకునేందుకు.. రష్యా వందల సంఖ్యలో నౌకలను వివిధ దేశాల జెండాలతో నడుపుతోంది. ఈ 'షాడో ఫ్లీట్'లో భాగంగానే ఈ ట్యాంకర్ రష్యా నుంచి చమురు రవాణా చేస్తోందని బ్రిటన్ ఆరోపించింది. జూన్ 5న ఇది రష్యా పోర్టు నుంచి ఈజిప్టునకు బయల్దేరిందని పేర్కొంది. ప్రస్తుతం ఈ నౌక ఇంగ్లాండ్ దక్షిణ తీరంలో ఓ సురక్షిత స్థానంలో ఉంది.

## 75 దేశాలకు వీసాల నిలిపివేత నిర్ణయం

### ట్రంప్ సర్కార్ నిర్ణయాన్ని కొట్టివేసిన న్యాయస్థానం



**వాషింగ్టన్, ఆగస్టు 22 :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు స్థానిక కోర్టులో షాక్ తగిలింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా సహా మొత్తం 75 దేశాల పౌరులకు తమ దేశ ఇమిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని ఈ ఏడాది జనవరిలో ట్రంప్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం కొట్టేసింది. ఈ ప్రకటన ఫెడరల్ వలస చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జీనెట్ వెల్లడించారు. వలస వీసాల విషయంలో కాన్సులర్ అధికారుల జోక్యంపై విదేశాంగ కార్యదర్శికి ఉన్న అధికారాన్ని ఆ చట్టం తొలగించిందన్నారు. వారి వీసాలను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. 75 దేశాల వ్యక్తులు అమెరికా ప్రజల నుంచి ఆమోదయోగ్యం కానంత అధికంగా సంక్షేమ ఫలాలు పొందుతున్నారు! అందుకే వారికి ఇమ్మిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని నిర్ణయించాం. కొత్త వలసదారులు అమెరికన్ల సంపదను సంగ్రహించకుండా రక్షణ కల్పించేంతవరకూ, వారు మాకు భారంగా మారరని నిర్ధారణ అయ్యేంతవరకూ ఈ నిలిపివేత అమల్లో ఉంటుంది. ట్రంప్ సర్కారు ఎప్పుడూ అమెరికా ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తుంది' అని ఆ దేశ విదేశాంగ శాఖ అప్పట్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

## హేజో లేబొరేటరీస్ కెమికల్ కంపెనీలో పేలుడు

### ఇద్దరు కార్మికుల మృతి.. క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలింపు

**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 22 :** యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం శివారులోని హేజో లేబొరేటరీస్ కెమికల్ కంపెనీలో రియాక్టర్ భారీ శబ్దంతో పేలింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా.. మరో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కంపెనీలోని సి-బ్లాక్‌లో నైట్ షిఫ్ట్‌లో 18 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. రియాక్టర్ వద్ద పనులు జరుగుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. క్షణాల్లో మంటలు వ్యాపించడంతో కార్మికులు భయంతో పరుగులు తీశారు. పేలుడు ధాటికి పెద్దవూర మండలానికి చెందిన చిన్న నాగిరెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన నాగన్న బోయిన నరేష్‌కుమార్ మృతి చెందారు. రియాక్టర్ సమీపంలో పనిచేస్తున్న మరో పది మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రియాక్టర్ పేలిన శబ్దం భారీగా వినిపించడంతో పరిసర గ్రామాల ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందో తెలియక కొందరు ఇళ్ల నుంచి బయటకు వచ్చి రోడ్లపైకి పరుగులు తీశారు. ప్రమాదం గురించి తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో కంపెనీ వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే చౌటుప్పల్ రూరల్ సీఐ సతీష్‌రెడ్డి, ఎస్సై జగన్ పోలీసు సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. చౌటుప్పల్, హయత్‌నగర్ నుంచి ÷ర్ ఇంజిన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. హేజో లేబొరేటరీస్‌లో వరుసగా ప్రమాదాలు చోటుచేసుకోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత జూలై 16న రసాయన వాయువులు పీల్చడంతో అనంతపురం జిల్లా సింగనమల మండలం ఉలికల్లు గ్రామానికి చెందిన ఆలుమూరు కృష్ణారెడ్డి (42) అనే కార్మికుడు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఆ ఘటన జరిగి నెల రోజులు కూడా పూర్తికాకముందే తాజాగా రియాక్టర్ పేలడంతో భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదం తర్వాత కంపెనీ పరిసరాల్లో దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. కంపెనీ ఆవరణలో మురుగునీరు చేరి ఉండటంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వ్యాపిస్తోందని ఆరోపిస్తున్నారు. ఈ దుర్వాసన కారణంగా కొందరికి తలతిరగడం, వాంతులు వంటి ఇబ్బందులు ఎదురైనట్లు చెబుతున్నారు. కెమికల్ కంపెనీలో వరుస ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు తగిన స్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రియాక్టర్ పేలుడు, గతంలో కార్మికుడి మృతి ఘటనల నేపథ్యంలో కంపెనీలో భద్రతా ప్రమాణాలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు.



## గచ్చిబౌలిలో కుప్పకూలిన ఏడంతస్తుల భవనం

### ఇద్దరు మృతి.. మరొకరికి తీవ్ర గామాలు

**హైదరాబాద్, ఆగస్టు 22 :** గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. రమణారెడ్డి అనే మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. అయితే, నాలాను ఆనుకుని 50 గజాల్లో అక్రమంగా ఈ భవనాన్ని నిర్మించారు. ఈ నిర్మాణం కూలిన పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై శకలాలు పడ్డాయి. భయంతో పక్కనే ఉన్న హాస్టల్లోకి విద్యార్థులు పరుగులు తీశారు. ఈ సంఘటన స్థలానికి హైడ్రా, డీఆర్ఎఫ్ టీమ్స్ చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. సీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనం నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో ఈ నిర్మాణానికి సీఎంసీ టౌన్ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయిలో అధికారులకు ముడుపులిచ్చి ఈ భవనాన్ని యజమాని నిర్మిస్తున్నట్లు సమాచారం. క్రమంగా బిల్డింగ్ నిర్మాణాన్ని ఖాజా అనే వ్యక్తి చేపట్టాడు. అంజయ్య నగర్‌లో అత్యంత ప్రమాదకర స్థాయిలో భవనాల నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖాజా నిర్మిస్తున్న అక్రమ భవనంపై పలుమార్లు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు ఫిర్యాదు చేశారు. అయిన హైడ్రా, సీఎంసీ సిబ్బంది పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే అంజయ్య నగర్‌లో ఐదు అంతస్తుల భవనం పక్కకు ఒరిగింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## 19 రోజులైనా ఆచూకీ లేని మత్స్యకారులు

### ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు చర్యలు

**విశాఖపట్టణం, ఆగస్టు 22 :** కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు జెట్టీ నుంచి సముద్రంలోకి చేపల వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారుల బోటు గత 19 రోజులుగా కనిపించకుండాపోవడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ నెల 3న వేటకు బయలుదేరిన ఈ బోటుతో 5వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో కమ్యూనికేషన్ తెగిపోయింది. సాధారణంగా వేటకు వెళ్లినవారు తిరిగొస్తారనే నమ్మకంతో కుటుంబసభ్యులు ఈ నెల 13వ తేదీ వరకు వేచి చూశారు. అయినప్పటికీ వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో ఆందోళనకు గురై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 17వ తేదీ నుంచి బాధితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలను యంత్రాంగం వేగవంతం చేసింది. ఈ గాలింపు చర్యల్లో విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న నాలుగు కోస్ట్ గార్డ్ నౌకలతో పాటు రెండు నేవీ హెలికాప్టర్లు బంగాళాఖాతంలో తీవ్రంగా శోధిస్తున్నాయి. విశాఖపట్నం, చెన్నై నుంచి వచ్చిన నేవీ నౌకలు సముద్రంలో అత్యంత లోతైన ప్రాంతాల్లో అన్వేషణ కొనసాగిస్తున్నాయి. కాకినాడ, విశాఖ కోస్ట్ గార్డ్ బృందాలు, మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు పరస్పర సమన్వయంతో నేడు ఐదో రోజు కూడా గాలింపు ప్రక్రియను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు పోలీసులు బాధితుల సెల్‌ఫోన్ నంబర్లను సేకరించి, వారి కాల్ డేటాను విశ్లేషిస్తూ సాంకేతిక ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే, సదరు బోటులో ముందస్తు జాగ్రత్తగా ఊ÷ఎఈ ట్రాన్స్‌పాండర్ పరికరాన్ని ఏర్పాటు చేయకపోవడం వల్లే కమ్యూనికేషన్ పూర్తిగా నిలిచిపోయి, వారి లొకేషన్‌ను గుర్తించడం కష్టతరంగా మారింది. మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో వారి కుటుంబసభ్యులు తీవ్ర భయాందోళనలతో ఎదురుచూస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలను రాజమండ్రి ప్రతినిధి శ్రీనివాస్ త్వరలోనే అందించనున్నారు.



## హర్మూజ్‌పై ట్రంప్ కొత్త మెలిక

### ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు

**వాషింగ్టన్, ఆగస్టు 22 :** పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసాయి తారా స్థాయికి చేరేలా ఉన్నాయి. హర్మూజ్ జలసంధి విషయంలో ఇరుదేశాలు పట్టువీడకపోవడమే అందుకు కారణం. హర్మూజ్‌ను తమ భూభాగంగా ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్ టెహ్రాన్‌పై ఆర్థికపరమైన ఆంక్షలు విధిస్తామని హెచ్చరించారు. అయినా సరే ఇరాన్ మాత్రం వెరవడం లేదు. మరోసారి తమను భయపెట్టాలని చూస్తే విధ్వంసకరంగా బదులిస్తామని పేర్కొంది టెహ్రాన్. ఆరు నెలలకు పైగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభాం చూపిస్తోంది ఇరాన్ ? ఇజ్రాయేల్ ? అమెరికా యుద్ధం. అంతర్జాతీయ జల రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిపై ఇరాన్ పట్టు వదులుకునేందుకు సిద్ధంగా లేకపోవడం.. అమెరికా మాత్రం ఆ జలసంధిని తమ భూభాగంగా ప్రకటించడం తాజాగా మరింత ఉద్రిక్తతలకు ఆజ్యం పోశాయి.



## రూపారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ట్రస్మా సభ్యులు

**కూకట్‌పల్లి, ఆగస్టు 22 :** విద్యార్థి చేతిలో దారుణంగా హత్య గురైన రూపా రెడ్డి కుటుంబాన్ని తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల సంఘం ( ట్రస్మా) ప్రతినిధులు పరామర్శించారు. తురక యంజాల్ లోని తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి మాట్లాడుతూ ఓ ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థుల దాడిలో మృతి చెందడం విచారకరమన్నారు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించడంలో ప్రస్తుత సమాజంలోని అందరూ విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమశిక్షణ నేర్పించడంలో అటు తల్లిదండ్రులు పిల్లల్ని పట్టించుకోకపోవడం వల్లనే వారు చెడు మార్గాల్లో ప్రయాణిస్తున్నారని ఆందోళన చెందారు. ప్రస్తుతం ఉన్న సోషల్ మీడియా ప్రభావం వల్ల విద్యార్థుల్లో పెడ ధోరణులు, విపరీత ధోరణులు రోజుకు పెరిగిపోతున్నాయని అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సహకరించినట్లయితే పిల్లల్ని చిన్నతనం నుంచే సన్మార్గంలో నడిపించే అవకాశం ఉంటుందని తెలిపారు. కానీ తల్లిదండ్రుల అతి గారాభం వల్ల అది సాధ్యపడటం లేదన్నారు. గంజాయి మత్తు పదార్థాల నివారించడంలో ప్రభుత్వ యంత్రాంగం పటిష్టంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత రోజుల్లో గంజాయి డ్రగ్స్ విచ్చలవిడిగా మార్కెట్లో దొరుకుతుందని వాటికి బానిసై పిల్లలు పాడవుతున్నారని ఆవేదన చెందారు. కార్యక్రమం లో ట్రస్మా రాష్ట్ర కోశాధికారి కె.శ్రీకాంత్ రెడ్డి, నాయకులు రాణి, వి.సుదర్శన్ రెడ్డి, రామకృష్ణ, ట్రస్మా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగ మహిళలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

**భద్రాచలం, ఆగస్టు 22 :** పట్టణంలోని రాజుపేట కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేద దివ్యాంగ మహిళలు హసీనా, షాహిదాలకు ప్రభుత్వం వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని భద్రాచలం బీఆర్ఎస్ నాయకులు ఇమంది నాగేశ్వరరావు కోరారు. హసీనా పుట్టుకతోనే మూగ, చెవిటి కాగా, షాహిదా పుట్టుకతోనే మరుగుజ్జు అని తెలిపారు. అత్యంత పేదరికంలో జీవిస్తున్న వీరికి సొంత ఇల్లు లేకపోవడంతో ప్రస్తుతం తెలిసిన వారి వద్ద ఆశ్రయం పొందుతూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. పలుమార్లు అధికారులకు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు ఫలితం లేకపోవడం బాధాకరమన్నారు. నిజమైన అర్హులైన నిరుపేదలు, దివ్యాంగులకు సంక్షేమ పథకాలు అందినప్పుడే వాటి ఉద్దేశ్యం నెరవేరుతుందని తెలిపారు. వారి పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించి వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ప్రత్యేక చొరవ తీసుకుని ఇద్దరు దివ్యాంగ మహిళలకు ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇమంది నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.



## బీఎల్వోలకు ఘన సన్మానం

**రాజాపూర్ ప్రతినిధి, ఆగస్టు 22:** తిరుమలాపూర్ గ్రామ పంచాయతీ వేదికగా బీఎల్వోలు శ్యామల, లలితలను గ్రామ సర్పంచ్ బంగారి సంతోష వెంకటేష్, డిప్యూటీ సర్పంచ్ మంత్రి రాంచందర్, వార్డు సభ్యులు ఘనంగా సన్మానించారు.

గ్రామంలో ఎన్నికల ప్రక్రియను, ముఖ్యంగా ఎస్ఐఆర్ ఓటర్ల చైతన్య కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బీఎల్వోలు శ్యామల, లలితలు చేసిన సేవలను ఈ సందర్భంగా అభినందించారు. గత నెల రోజులుగా ఎంతో నిబద్ధత, ఓర్పుతో పనిచేస్తూ ప్రతి ఓటరుకు అవగాహన కల్పించడంతో పాటు ఎలాంటి పొరపాట్లు లేకుండా ఓటర్ల జాబితా రూపకల్పనలో కృషి చేశారని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో బీఎల్వోల పాత్ర ఎంతో కీలకమని, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించిన శ్యామల, లలితలకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భరత్ కుమార్, వార్డు సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ నాయక్, రహీమద్దీ, చెన్నయ్య, కాకర్ల ప్రకాష్, పాషా, గుడ్ల స్వరూప, శ్రీశైలం, రెడ్యానాయక్, నాయకులు చంద్రయ్య, సంతోష్ నాయక్, యాదయ్య, వడ్ల శ్రీహరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

### సీపీఐ(ఎం) పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్

**తిరుమలాయపాలెం, ఆగస్టు 22:** అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలని సీపీఐ(ఎం) పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని గజ్జల వెంకటయ్య కార్యాలయంలో శనివారం పద్మనాభుల సుధాకర్‌రావు అధ్యక్షతన సీపీఐ(ఎం) జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బండి రమేష్ మాట్లాడుతూ గ్రామాల్లో అనేక మంది పేదలు సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇళ్లు లేక ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురు అన్నదమ్ములు కుటుంబాలతో కలిసి నివసించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అలాగే శిథిలావస్థకు చేరిన పాత పెంకుటిళ్ల స్థానంలో అర్హులైన పేదలకు నూతన ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో రాజకీయ జోక్యాన్ని నివారించి, అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని బండి రమేష్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.పీ. బసిరుద్దీన్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, తుళ్లూరు నాగేశ్వరరావు, వర్షపుంగు వీరన్న, డింగి రమేష్, దాసరి మహేందర్, నిరసన వెంకటేష్, దొడ్డ లింగస్వామి, ఎస్.కె. పత్తి అహ్మద్ పాల్గొన్నారు.

# నాలా పక్కన 50 గజాల్లో నిర్మాణం..

# కుప్పకూలిన ఏడంతస్తుల భవనం

- పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై పడటంతో పలువురికి గాయాలు
- ఇద్దరు కార్మికులు మృతి.. మరికొందరికి గాయాలు
- అనుమతులపై స్థానికుల ఆగ్రహం.. అధికారులపై ప్రశ్నల వర్షం





**శేరిలింగంపల్లి, ఆగస్టు 22(జనం వార్త):** మాదాపూర్‌లోని అంజయ్య నగర్‌లో భారీ భవన ప్రమాదం చోటుచేసుకుంది. నాలా పక్కనే కేవలం 50 గజాల స్థలంలో నిర్మిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడు అంతస్తుల భవనం శుక్రవారం అకస్మాత్తుగా కుప్పకూలింది. నిర్మాణం లో ఉన్న భవనం పక్కనే ఉన్న మరో అపార్ట్‌మెంట్‌పై పడటంతో అక్కడ నివసిస్తున్న పలువురు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా, మరికొందరు గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికుల వివరాల ప్రకారం.. అంజయ్య నగర్‌లో నాలాకు అత్యంత సమీపంలో ఉన్న చిన్న విస్తీర్ణంలోని స్థలంలో భారీ భవన నిర్మాణం చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. తగిన అనుమతులు లేకుండానే లేదా అనుమతులకు మించి అంతస్తులు నిర్మిస్తున్న సమయంలోనే భవనం ఒక్కసారిగా కుప్పకూలినట్లు చెబుతున్నారు. భవనం కూలిన సమయంలో భారీ శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కూలిన నిర్మాణ శిథిలాలు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై పడటంతో ఆ భవనం కూడా తీవ్రంగా దెబ్బతింది. అపార్ట్‌మెంట్‌లోని కొందరికి గాయాలు కావడంతో స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను ముమ్మరం చేశారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. నాలా పక్కనే ఉన్న 50 గజాల స్థలంలో ఏడు అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతులు ఎలా లభించాయంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణ సమయంలోనే సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించలేదా అని నిలదీస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల విచారణ

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, మున్సిపల్ అధికారులు, హైడ్రా అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, స్థల విస్తీర్ణం, నిర్మాణ నిబంధనలు, భవనం ఎన్ని అంతస్తులకు అనుమతి పొందింది తదితర అంశాలపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. భవన నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించారా? అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎన్ని అంతస్తులకు అనుమతి ఇచ్చారు? నాలా పరిధిలో నిర్మాణానికి నిబంధనలు ఏమిటి? వంటి అంశాలపై విచారణ కొనసాగుతోంది.

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రమాదానికి కారణమైన నిర్మాణ సంస్థ, యజమానులు, సంబంధిత అనుమతుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నాలాలు, డ్రైనేజీల సమీపంలోని అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. సంఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం భవన నిర్మాణానికి సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**మనిషి కలలను చంపేది ఎప్పుడూ వైఫల్యాలు మాత్రమే కాదు... “నలుగురు ఏమనుకుంటారో?” అనే భయం కూడా. జీవితాలను వెనక్కి లాగేది పరిస్థితులు మాత్రమే కాదు... ఇతరుల అభిప్రాయాలకు మనం ఇచ్చే అతి ప్రాధాన్యత కూడా. మనిషికి కనిపించే సంకెళ్ల నుంచి బయటపడటం సులభమే. కానీ కనిపించని సంకెళ్లను తెంచుకోవడం అంత తేలిక కాదు. నేటి సమాజంలో లక్షలాది మంది అలాంటి అదృశ్య బంధాల్లోనే జీవిస్తున్నారు. ఆ సంకెళ్లకు ఒక్కటే పేరు... “నలుగురు ఏమనుకుంటారో!” ఇది కేవలం ఒక సందేహం కాదు. మనిషి ఆత్మవిశ్వాసాన్ని నిశ్శబ్దంగా కరిగించే మానసిక ఒత్తిడి. స్వతంత్ర ఆలోచనను బంధించే సామాజిక మనస్తత్వం. వ్యక్తిత్వాన్ని హననం చేసే కనిపించని గోడ.**



# నలుగురు ఏమనుకుంటారో!

- జీవితం నీది.. నిర్ణయం ఎవరిది.?
- ఇతరుల అభిప్రాయాల బంధనంలో చిక్కుకుంటున్న నేటి సమాజం
- స్వేచ్ఛగా ఆలోచించే ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్న మనిషి

**హైదరాబాద్ :** మనసు ఒక దారి చూపుతుంటే, సమాజం ఏమంటుందోననే భయం మరో దారికి నడిపిస్తోంది. ఫలితంగా ఎన్నో కలలు పుట్టకముందే చనిపోతున్నాయి. ఇష్టమైన చదువు, నచ్చిన వృత్తి, స్వతంత్ర నిర్ణయం... ఇవన్నీ “నలుగురు ఏమంటారు?” అనే ఒక్క ప్రశ్న ముందు తలవంచుతున్నాయి. విచిత్రం ఏమిటంటే... మన జీవితాలను ప్రభావితం చేస్తున్న ఆ “నలుగురు” ఎవరో కూడా చాలా సందర్భాల్లో మనకు తెలియదు. కానీ వారి ఊహాత్మక అభిప్రాయాల కోసం మన ఆనందాన్ని, మన ఆశయాలను, మన వ్యక్తిత్వాన్ని త్యాగం చేస్తున్నాం. ఇదే నేటి సమాజంలో వేగంగా విస్తరిస్తున్న అత్యంత ప్రమాదకరమైన మానసిక బంధం.

### ఇతరుల అభిప్రాయాలకు బానిసవుతున్నామా?

ఒకప్పుడు సమాజం మనిషికి విలువలు నేర్పేది. నేడు చాలాసార్లు అదే సమాజం అతని జీవితాన్ని తీర్పు చెబుతోంది. చదువు ఏది చదవాలి, ఉద్యోగం ఏది చేయాలి, ఎవరిని పెళ్లి చేసుకోవాలి, ఏ బట్టలు వేసుకోవాలి, సోషల్ మీడియాలో ఎలా కనిపించాలి... ఇలా ప్రతి నిర్ణయం ముందు ఒకే ప్రశ్న నిలుస్తోంది. ఇది చేస్తే నలుగురు ఏమంటారు?” ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం నాగరికత. కానీ వాటికి బానిస కావడం వ్యక్తిత్వానికి ప్రమాదం. ఎందుకంటే మన నిర్ణయాలను చర్చించేది సమాజం. కానీ వాటి ఫలితాలను అనుభవించేది మాత్రం మనమే. ఫలితంగా ఆత్మవిశ్వాసం తగ్గుతోంది. స్వతంత్ర ఆలోచన బలహీనపడుతోంది. కొత్త ఆలోచనలు పుట్టకముందే చనిపోతున్నాయి.

### ‘జనం ఏమంటారు?’ అనే ఆందోళన

ఇష్టమైన కోర్సును వదిలి “గౌరవంగా ఉండే” చదువును ఎంచుకుంటున్న విద్యార్థులు. కల ఉద్యోగాన్ని వదిలి “స్టేటస్” కోసం జీవితాన్ని పణంగా పెడుతున్న యువత. “ఫెయిల్ అయితే నవ్వుతారు” అని వ్యాపారం చేయడానికి భయపడుతున్న యువకులు. ప్రేమించిన వ్యక్తిని వదిలి ఇష్టంలేని సంబంధాలను అంగీకరిస్తున్న యువత. ఇవి ఒక్కో కుటుంబ కథలు కావు. నేటి సమాజం ఎదుర్కొంటున్న మౌన సంక్షోభం.

### మన గురించి నిజంగా ఎవరు ఆలోచించరు

మనోవిజ్ఞాన శాస్త్రంలో ‘స్పాట్‌లైట్ ఎఫెక్ట్’ అనే భావన ఉంది. అంటే అందరూ మనల్నే గమనిస్తున్నారని, మన ప్రతి నిర్ణయాన్ని విశ్లేషిస్తున్నారని మనం భావించడం. కానీ వాస్తవం ఏమిటంటే ప్రతి వ్యక్తి తన జీవిత సమస్యలతోనే బిజీగా ఉంటాడు. మన గురించి మనం అనుకున్నంతగా ఎవరూ ఆలోచించరు. అయినా “ప్రపంచం నన్నే చూస్తోంది” అనే భ్రమలో మనమే మన జీవితానికి సంకెళ్లు వేసుకుంటున్నాం.

### సోషల్ మీడియా: పోలికల మాయాజాలం

ఒకప్పుడు మనిషి పొరుగింటి వారితో పోల్చుకునేవాడు. ఇప్పుడు ప్రపంచమంతా మొబైల్‌లోకి వచ్చేసింది. ఎవరో విదేశాల్లో ఉన్నారు, ఎవరో కొత్త కారు కొన్నారు, ఎవరో విలాసవంతమైన జీవితం గడుపుతున్నా రు. వాటిని చూసి మన జీవితాన్ని తక్కువగా అంచనా వేస్తున్నాం. కా నీ గుర్తుంచుకోవాలి. సోషల్ మీడియాలో కనిపించేది జీవితంలోని హైలైట్ మాత్రమే. అక్కడ నవ్వులు కనిపిస్తాయి, కానీ కన్నీళ్లు కనిపించవు. విజయాలు కనిపిస్తాయి, కానీ వాటి వెనుక ఉన్న పోరాటం కనిపించదు.

### విమర్శలకు కృంగిపోవద్దు

మీరు మాట్లాడినా విమర్శిస్తారు. మాట్లాడకపోయినా విమర్శిస్తారు. విజయం సాధించినా విమర్శిస్తారు. విఫలమైనా విమర్శిస్తారు. కాబట్టి విమర్శలు రావడం సమస్య కాదు. వాటినే జీవితానికి ప్రమాణంగా తీసుకోవడమే సమస్య. నిజాయితీతో చేసిన సూచనలను స్వీకరించాలి. అసూయతో చేసిన వ్యాఖ్యలను వదిలేయాలి.

### పిల్లలకు నేర్పాల్సింది భయం కాదు... బాధ్యత

“అలా చేయొద్దు... నలుగురు ఏమంటారు?” అని పిల్లలను పెంచితే వాళ్లు భయంతో జీవించడం నేర్చుకుంటారు. దానికి బదులు “నువ్వు చేస్తున్నది సరైందా? దానివల్ల ఎవరికైనా నష్టం జరుగుతుందా? నీ మనసు దాన్ని అంగీకరిస్తుందా?” అని ప్రశ్నించడం నేర్పాలి. అప్పుడే వాళ్లు బాధ్యతతో నిర్ణయాలు తీసుకునే వ్యక్తులుగా ఎదుగుతారు. జీవితం నీది ఈ ప్రపంచం మాట్లాడుతూనే ఉంటుంది. అందరినీ సంతోషపెట్టడం అసాధ్యం. కానీ ఒక వ్యక్తిని మాత్రం మనం ఎప్పటికీ నిరాశపరచకూడదు. అతడే... మన అంతరాత్మ. ఎదుటివారు ఏమనుకుంటారో మన చేతుల్లో ఉండదు. కానీ మనం ఎలా ఆలోచించాలి, ఎలా నిర్ణయాలు తీసుకోవాలి, ఎలా జీవించాలి అనేది పూర్తిగా మన చేతుల్లోనే ఉంటుంది. ఇతరుల అభిప్రాయాలు జీవితానికి దిశ చూపవచ్చు. కానీ అవే జీవితాన్ని నడపకూడదు. జీవితాన్ని నలుగురి చప్పట్ల కోసం కాదు... మన అంతరాత్మ అంగీకారం కోసం జీవించాలి. **ఎందుకంటే జీవితం నీది... నిర్ణయం కూడా నీదే కావాలి.**

– జి. అజయ్ కుమార్
సామాజిక విశ్లేషకులు

# 3 దశాబ్దాల వెలిగొండ కల సాకారం

- ఆగస్టు 31న వెలిగొండ ద్వారా నీళ్లు విడుదల
- మూడో విడతలో రూ.250 కోట్ల పరిహారం అందించిన సీఎం
- నిర్వాసితులకు చెక్కును అందజేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- 48 రోజుల్లో రూ.768 కోట్లు చెల్లించిన కూటమి ప్రభుత్వం



**అమరావతి, ఆగస్టు 22 :** మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల 30 ఏళ్ల ఆకాంక్షలు నెరవేరేలా వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం కానుంది. ఆగస్టు 31వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించి నీళ్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వెలిగొండ నిర్వాసితులకు మూడో విడతలో రూ.250 కోట్ల పరిహారం చెక్కును సీఎం చంద్రబాబు అందించారు. దీంతో ఇప్పటి వరకూ 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. మొదటి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు, రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. శుక్రవారం మూడో విడతగా 2,027 కుటుంబాలకు రూ.250 కోట్లు పరిహారాన్ని సీఎం చేతుల మీదుగా అందించారు. 48 రోజుల్లోనే నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.768 కోట్లను చెల్లించింది. నిర్వాసితులకు మరో రూ.132 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంది. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ద్వారా మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు, 4 లక్షల మందికి తాగునీరు అందనుంది. వెలిగొండ నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "ఆయా జిల్లాల ప్రజల 30 ఏళ్ల కలను సుసాధ్యం చేసి చూపించాం. సీఎంగా 1995లో ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడు రైతులు సాగు, తాగునీరు ఇవ్వాలని కోరారు. 1996లో నేనే ప్రాజెక్టుకు రూపకల్పన చేసి శంకుస్థాపన చేసి... 2026లో ప్రారంభిస్తున్నాను. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తి చేసి ఇప్పుడు ప్రారంభించేలా రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేశాం. నాడు ఎన్టీఆర్ శంకుస్థాపన చేసిన వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రారంభించటం నా అదృష్టం. ఈ ఏడాది ఎల్ నినో కారణంగా 50 శాతం లోటు వర్షపాతం ఉంది. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు నీళ్లు రాలేదు. చాలా పొదుపుగా నీటిని వినియోగించుకోవాల్సి ఉంది. ఇబ్బందులు ఉన్నా ఎట్టి పరిస్థితుల్లోనూ వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి నీరు ఇవ్వాలని సంకల్పించుకున్నాం. 2021లోనే దీనిని పూర్తి చేసి నీరివ్వాల్సి ఉన్నా గత పాలకులు చేసిన డ్రామాలతో అది సాధ్యం కాలేదు. పోలవరం పూర్తి చేసి కృష్ణాడెల్టాకు, శ్రీశైలంలో నీరు పొదుపు చేసి ప్రకాశం, నెల్లూరు, కడప, రాయలసీమ ప్రాంతానికి నీరు ఇవ్వొచ్చు. గంగా–గోదావరి– కావేరి అనుసంధానించాలని సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించాను. ఐదు నదులను అనుసంధానిస్తే నాలుగు రాష్ట్రాల్లో సమస్యలు తీరిపోతాయి. దేశానికే నీటి సమస్య పరిష్కారమై నీటి భద్రత వస్తుంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మేలు జరిగేలా ప్రయత్నం చేస్తున్నాం. ఈ నెల 31 తేదీన వెలిగొండ ద్వారా నీళ్లు విడుదల చేస్తాం. మార్కాపురం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికి కుళాయి నీరు ఇస్తాం. సెప్టెంబరులోనే హార్టికల్చర్ హబ్‌కు ఫౌండేషన్ వేస్తాం. రామాయపట్నం పోర్టు ద్వారా రైతులు ఉద్యాన ఉత్పత్తుల్ని ఎగుమతి చేసుకునే అవకాశం ఉంటుంది. గత పాలకులు ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్ లాంటి పథకాలు అమలు చేస్తున్నాం. అభివృద్ధితో పాటు ప్రాజెక్టులు కూడా పూర్తి చేయాల్సి ఉంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి. మంచి చేసే ప్రభుత్వాన్ని గుర్తించాలని ప్రజల్ని కోరుతున్నాను."అని ముఖ్యమంత్రి అన్నారు.

### పునరావాస ప్యాకేజీ పై నిర్వాసితుల సంతృప్తి

గత ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిందని.. నాటి సీఎం ప్రకాశం జిల్లాకు వచ్చినప్పుడు పరిహారం అడుగుతామని నోటీసులు ఇచ్చి బయటకు రాకుండా చేశారని.. ప్రాజెక్టు కింద పొలాలను కోల్పోయినా కూటమి ప్రభుత్వం ఇచ్చిన పరిహారం సంతోషం కలిగించిందని వెలిగొండ నిర్వాసిత రైతు కాశిరెడ్డి అన్నారు. చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఆయనే ఇప్పుడు ప్రారంభిస్తున్నారని.. తాము కలగా భావించిన ప్రాజెక్టు తమ కళ్ల ముందే సాకారమైందని..తమ ప్రాంతానికి సాగునీరు, తాగునీరు రావటం సంతోషంగా ఉందని నిర్వాసిత రైతు బోగెం శ్రీనివాసులు అన్నారు. తమకు పరిహారం పూర్తిగా అందించిందని.. కాలనీల్లో వసతుల కల్పన బాగుందని నిర్వాసితులకు ప్రభుత్వం అండగా నిలవటం సంతృప్తిగా ఉందని మహిళా నిర్వాసితురాలు ఉషమ్మ తెలిపారు. ఈ సమావేశంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం ఇంచార్జి ఎరిక్షన్ బాబు, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ ప్రశాంతి, వెలిగొండ నిర్వాసితులు పాల్గొన్నారు.



## అనకాపల్లికి గోదావరి నీళ్లు తెప్పిస్తాం

**వచ్చే నెలలోనే నీటిని రప్పించి చెరువులు నింపుతాం**

**అనకాపల్లి పర్యటనలో సీఎం చంద్రబాబు**

**అనకాపల్లి, ఆగస్టు 22 :** అనకాపల్లికి నీళ్లు తెచ్చే బాధ్యత తనది అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. త్వరలోనే అనకాపల్లి, విశాఖకు గోదావరి నీళ్లు తీసుకొస్తామని.. జిల్లాలో ప్రతి చెరువు, రిజర్వాయర్లను నింపుతామని వెల్లడించారు. సెప్టెంబర్ తొలి వారంలోనే అనకాపల్లికి నీళ్లు తెచ్చి చూపిస్తామని పేర్కొన్నారు. 'మేం చేస్తున్న పనులను అభినందిస్తే అదే పెద్ద కిక్' అని చెప్పుకొచ్చారు. జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. అనకాపల్లి అంటే బెల్లం ఒక్కటే కాదని.. ఇండస్ట్రియల్ ఏరియా అని అన్నారు. రాబోయే రోజుల్లో దేశంలోనే అనకాపల్లి జిల్లా నం.1 అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. మంచిపనులు చేస్తుంటే కొందరు అడ్డుకోవాలని చూస్తున్నారని సీఎం మండిపడ్డారు. విమర్శలు చేసేవారికి డేటా సెంటర్ అంటే తెలియదని విమర్శించారు. ఇప్పటి వరకు డేటా సెంటర్ ప్రారంభం కాలేదని, తాగడానికి నీళ్లు లేవంటూ దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. డేటా సెంటర్ వస్తే లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. డేటా సెంటర్లతో ఆదాయం కూడా పెరుగుతుందని తెలిపారు. దేశంలో తొలిసారి క్వాంటం కంప్యూటర్ అమరావతికి వస్తోందన్నారు. విద్యార్థులకు ఇప్పటి నుంచే ఆ టెక్నాలజీ నేర్పాలని సూచించారు. అది నేర్చుకుంటే రాబోయే రోజుల్లో ప్రపంచాన్ని జయించవచ్చారు. భివృద్ధి అంటే పరిశ్రమలు, పెట్టుబడులు మాత్రమే కాదని.. పర్యావరణ పరిరక్షణ కూడా అభివృద్ధిలో భాగమే అని చంద్రబాబు అన్నారు. చెత్త నుంచి కంపోస్ట్, కరెంట్, గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామం జీరో వేస్ట్ పంచాయతీగా తయారుకావాలని సూచించారు. ఆడబిడ్డల కోసం మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో మూడు గ్యాస్ సిలిండర్ల డబ్బులను 4 నెలలకోసారి జమ చేస్తామన్నారు. ఇండక్షన్ స్టవ్‌లు పెట్టుకుంటే గ్యాస్‌తో కూడా అంత పని ఉండదని అన్నారు.

## యూపి ఎన్నికల్లో పటిష్ట చర్యలు

**యోగి సహా 52మంది నేతలకు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు**

**న్యూఢిల్లీ, ఆగస్టు 22 :** ఉత్తరప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్య నేతలకు బు÷–లలెట్ ప్రూఫ్ జాకెట్లను అందజేశారు. సుమారు 52 మంది నేతలకు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఒక్కొక్క బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ఖరీదు సుమారు 10 లక్షలు ఉన్నట్లు భావిస్తున్నారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ చీఫ్ మాయావతికి కూడా ఆ జాకెట్లను అందజేశారు. భద్రతలో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. వీరితో పాటు ఆ జాబితాలో 11 మంది మంత్రులు ఉన్నారు. సంజయ్ నిషాద్, నంద్ గోపాల్ గుప్తా, ఓం ప్రకాశ్ రాజ్‌భర్, బీజేపీ నేత అపర్ణయాదవ్ ఉన్నారు. తొలి దశలో 8 మందికి , రెండో దశలో 44 మందికి జాకెట్లను అందజేశారు. బీజేపీ నేతలు స్వతంత్ర దేవ్ సింగ్, జైవీర్ సింగ్, మహేంద్ర సింగ్‌కు కూడా జాకెట్లు ఇచ్చారు. యూపీలోని సుమారు 98 మంది ఇతర ముఖ్య నేతలకు ప్రత్యేకమైన భద్రతను కల్పించనున్నారు.



## ఫ్లోరైడ్ జిల్లాలకు వరంగా వెలిగొండ

**ఆయా ప్రాంతా ప్రజల నీటి కష్టాలు తొలగిపోతాయి**

**మంత్రి నిమ్మల రామానాయుడు**

**అమరావతి, ఆగస్టు 22 :** ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లోని కరవు, ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు వెలిగొండ ప్రాజెక్టు వరమని ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆయా ప్రాంతాల ప్రజల నీటి కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు. 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆగస్టు 31న వెలిగొండను సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని స్పష్టం చేశారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి నిమ్మల మాట్లాడారు. ఈ సందర్భంగా ఆగస్టు 31న వెలిగొండ టన్నెల్స్ నుంచి 10.5 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు సీఎం చంద్రబాబు విడుదల చేస్తారని మంత్రి నిమ్మల తెలిపారు. ప్రాజెక్టు కోసం భూములిచ్చిన త్యాగధనులకు పరిహారం ఇచ్చాకే నీళ్లు వదలాలని చంద్రబాబు చెప్పారన్నారు. ఈ మేరకు 40 రోజుల్లోనే మూడు దశల్లో రూ.760 కోట్లను వెలిగొండ నిర్వాసితులకు ఇచ్చామని పేర్కొన్నారు. అధికారం చేపట్టిన రెండేళ్ల వ్యవధిలోనే ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వాసితులకు రూ.3 వేల కోట్లు పంపిణీ చేశామన్నారు. వెలిగొండలో అర్హత ఉన్న ఆఖరి నిర్వాసితుడి వరకు న్యాయం చేస్తామని మంత్రి నిమ్మల చెప్పుకొచ్చారు. ÷లిగొండ పనులు పూర్తి కాకుండానే వైఎస్ జగన్ నాడు ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేశారని నిమ్మల మండిపడ్డారు. ఈ సందర్భంగా మూడు దశాబ్దాల కలను సీఎం చంద్రబాబు నిజం చేస్తున్నారని ప్రశంసించారు. ఎల్–నినో వంటి క్లిష్ట సమయంలోనూ నల్లమల సాగర్‌కు 10.5 టీఎంసీల జలాలను తీసుకొస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వెలిగొండ నీళ్లతో ప్రకాశం జిల్లా సస్యశ్యామలం అవుతుందని మంత్రి ఆకాంక్షించారు. కాగా, ఈరోజు వెలిగొండ నిర్వాసితులకు రూ.250 కోట్లను మూడో విడత కింద సీఎం చంద్రబాబు విడుదల చేశారు.

## విశాఖలో బ్రిక్స్ దేశాల మంత్రుల సదస్సు

**తొట్లకొండ బౌద్ధ క్షేత్రాన్ని సందర్శించిన ప్రతినిధులు**



**విశాఖపట్టణం, ఆగస్ట్ 22 :** విశాఖలో బ్రిక్స్ దేశాల క్రీడా మంత్రుల సదస్సు ప్రారంభమైంది. తొలి రోజు బ్రిక్స్ ప్రతినిధుల బృందం చారిత్రక ప్రాంతం తొట్లకొండ బౌద్ధ క్షేత్రాన్ని సందర్శించింది. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడలశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో పాటు 11 బ్రిక్స్ దేశాల యువజన, క్రీడాశాఖల మంత్రులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బౌద్ధ క్షేత్రంలో మొక్కలు నాటారు. తొట్లకొండలోని మహాస్తూపం, బావులు, పాకశాల, ధ్యాన కేంద్రాలను పరిశీలించారు. విదేశీ ప్రతినిధులకు ఇక్కడి పురావస్తు అవశేషాలు, అప్పటి బౌద్ధజీవన విధానానికి సంబంధించిన విశేషాలను అధికారులు వివరించారు. ఈ సాయంత్రం విదేశీ ప్రతినిధులకు ఇచ్చే విందులో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. ఈ సదస్సుకు భారత్‌తో పాటు బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికా, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారు. శనివారం ఉదయం తొట్లకొండలో మొక్కలు నాటడంతో సమావేశాలు ప్రారంభమయ్యాయి. భారత్ అధ్యక్షతన జరగనున్న సమావేశాలను 'స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఇతివృత్తం ఆధారంగా నిర్వహించనున్నారు. కేంద్ర మంత్రి మాండవీయ తొలుత ప్రసంగాన్ని ప్రారంభిస్తారు. శనివారం జరిగే సమావేశంలో విద్య, నైపుణ్యాలు, వ్యవస్థాపకత, సంక్షేమం, సుస్థిరాభివృద్ధి వంటి అంశాలపై చర్చిస్తారు. ఉమ్మడి ప్రకటననూ, సహకార కార్యాచరణ విధానాన్నీ ముగింపు సందర్భంగా ఆమోదిస్తారు. ఆదివారం జరగనున్న క్రీడా మంత్రుల సమావేశంలో క్రీడల విధానంలో ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించడంపై చర్చించనున్నారు. దేశీయ క్రీడలు, క్రీడా రంగంలో సాంకేతిక సహకారం, క్రీడా పరికరాల తయారీ, ఉమ్మడి ప్రకటన ఖరారు చేసే అంశాలపై సమావేశం దృష్టి సారించనుంది. కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల సహాయ మంత్రి రక్షా ఖడ్సే ముగింపు వేడుకల్లో పాల్గొని మాట్లాడతారు. చివరిగా 11 బ్రిక్స్ దేశాల మంత్రులతో కూడిన ప్రతినిధి బృందాలు ఉమ్మడి ప్రకటనకు ఆమోదం తెలుపుతాయి.

## దళారుల నుండి ఆయిల్ పామ్ రైతులను కాపాడండి

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు డిమాండ్**

**ఏలూరు ఆగస్టు 22 :** చెమటోడ్చి పండించిన ఆయిల్ పామ్ రైతులను దళారీ వ్యవస్థ నిలువునా ముంచేస్తోందని,ఏలూరు జిల్లాలో కొన్ని వే–బ్రిడ్జ్ కాటాల వద్ద నవభారత్,గోద్రెజ్ ఫ్యాక్టరీకి వెళ్లే ఆయిల్ పామ్ గెలల విషయంలో దళారులు సాగిస్తున్న ఆగడాలు పరాకాష్టకు చేరాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణా రావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఏలూరు అన్నే భవనంలో ఆయిల్ పామ్ రైతుల సమస్యలపై వారు మాట్లాడారు. పగటిపూట రైతుల వద్ద సేకరించిన ఫ్రూట్‌ను కాటాల వద్ద పోసి, రాత్రికి రాత్రే దానిపై విచ్చలవిడిగా నీళ్లు కొడుతూ (వాటరింగ్) బరువు పెంచుతున్నారని,ఆ తర్వాతే ఆ లోడును ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని చెప్పారు. గెలల్లో నీటి శాతం ఎక్కువగా ఉందనే సాకుతో ఫ్యాక్టరీ యాజమాన్యం ఆయిల్ పామ్ గెలల ధరను తగ్గించి వేస్తున్నాయని చెప్పారు. దళారులు నీళ్లు కొట్టి దండుకున్న లాభాలకు,ఆయిల్ పామ్ రైతులు బలైపోతున్నారన్నారు . ఈ దళారుల దగా కారణంగా గత నెలలోనే టన్నుకు రూ. 450 చొప్పున ధర తగ్గి రైతులు నష్టపోయారని చెప్పారు. కష్టపడి పంట పండించిన రైతుకు నష్టం మిగులుతుంటే, మధ్యలో ఏమీ చేయని దళారులు మాత్రం జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. రైతుల శ్రమను దోచుకుంటున్న వే–బ్రిడ్జ్ కాటాల నిర్వాహకులు, దళారులపై ఉద్యాన,తూనికలు, కొలతలు శాఖల అధికారులు,జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కాటాల వద్ద అక్రమంగా నీళ్లు కొట్టే విధానానికి స్వస్తి పలికేలా నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు.దళారుల మోసాల వల్ల రైతులకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసి, ఆయిల్ పామ్ రైతుకు ప్రభుత్వం నిర్ణయించిన ధర అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పచ్చి గెలలు పేరుతో ఆయిల్ పామ్ ఫ్రూట్ ఏరివేత ఆపాలని కోరారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ నూతన కర్మాగారం నిర్మాణానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని తద్వారా ఓ.ఈ.ఆర్ సమస్యను పరిష్కరించాలన్నారు.

## 629 ఏఈఈ పోస్టులకు 1.05 లక్షల అభ్యర్థులు

- నేటి నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్షలు
- ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి



**విజయవాడ, ఆగస్టు 22 :** రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి ఈ నెల 23 నుంచి 27 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి తెలిపారు. పరీక్షలను పూర్తి పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పరీక్షలు రోజుకు రెండు షిఫ్టుల్లో జరుగుతాయి. మొదటి షిఫ్ట్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఒరిజినల్ హాల్‌టికెట్‌తో పాటు ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో ఫేస్ వెరిఫికేషన్, మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, కాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, పుస్తకాలు, కాగితాలు అనుమతించబోమన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామంటూ దళారులు చేసే ప్రచారాన్ని నమ్మొద్దని, అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని సీఎండీ సూచించారు



## నల్లమలసాగర్‌కు కృష్ణా జలాలు

- 31న సీఎం చేతుల మీదుగా వెలిగొండ ప్రారంభోత్సవం.
- నిర్వాసితులకు నేడు మరో 250 కోట్లు పరిహారం పంపిణీ.
- జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు.

**ఉండవల్లి, ఆగస్టు 22 :** వెనుకబడిన, ఫ్లోరైడ్ భాదిత ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టును ఈనెల 31న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఈ ప్రాజెక్టు ఫేజ్– 1 ప్రారంభం ద్వారా 10.7 టిఎంసిల కృష్ణమ్మ జలాలను నల్లమల సాగర్ కు ప్రవహింప జేయబోతున్నామని ఆయన వివరించారు. వెలిగొండ నిర్వాసితులకు సంబంధించి మూడవ విడతగా శనివారం ఉదయం 250 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద రామానాయుడు మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు ఉద్దేశించిన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంతో ఈ జిల్లాల ప్రజల దశ, దిశ మారబోతోందని ఆయన అన్నారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు వెలిగొండకు శ్రీకారం చుట్టారని, మళ్లీ ఆయనే, నేడు ముఖ్యమంత్రిగా వెలిగొండను ప్రారంభించబోతుండటం ఒక చరిత్రగా రామానాయుడు అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు వల్ల 4.47 లక్షల ఎకరాలకు సాగు, 23 లక్షల మందికి త్రాగు నీరందుతుందని ఆయన చెప్పారు. అలాగే వెలిగొండ నిర్వాసితులకు మూడు దశల్లో కేవలం 40 రోజుల వ్యవధిలో 760 కోట్ల రూపాయలను అందజేయటం, నిర్వాసితుల పట్ల ముఖ్యమంత్రికి ఉన్న బాధ్యతకు, ఆదరాభిమానాలకు నిదర్శనం అన్నారు. వెలిగొండ కు భూములు ఇచ్చిన త్యాగాధనులకు పరిహారం ఇచ్చాకే, నీళ్ళు వదలాలని చంద్రబాబు చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2250 కోట్లు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఈ రెండేళ్లలో ఇచ్చిన సంగతి కూడా ఆయన తెలియజేశారు. మొత్తం మీద కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ళలోనే, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వాసితులకు 3 వేల కోట్లు పరిహారం అందజేశామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు లో అర్హత ఉన్న ఆఖరి నిర్వాసితుడి వరకు న్యాయం చేస్తామని రామానాయుడు హామీ ఇచ్చారు. కాగా నాడు గొడ్డలి పార్టీ ప్రభుత్వ హయాంలో వెలిగొండ పనులు పూర్తవ్వకుండా, జగన్ జాతికి అంకితం చేసి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేశాడన్నారు. ఎల్ నినో వంటి క్లిష్ట సమయంలో నల్లమల సాగర్ కు 10.7 టీఎంసీ ల కృష్ణా జలాలను తీసుకొస్తున్నామంటే చంద్రబాబు ముందుచూపుకి, దార్శనికతకు నిదర్శనం అని అన్నారు. భవిష్యత్ లో వెలిగొండ నీళ్లతో ప్రకాశం జిల్లా సస్యశ్యామలం కాబోతోంది అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తో పాటు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యేలు కందుల నారాయణ రెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి, అశోక్ రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇంఛార్జ్ ఎరిక్షన్ బాబు, వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులు పాల్గొన్నారు.

## చిరంజీవికి ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు

**అమరావతి, ఆగస్టు 22 :** ప్రముఖ చలనచిత్ర నటుడు, కేంద్ర మాజీ మంత్రి, పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి గారికి జన్మదిన శుభాకాంక్షలు. 1978లో తెలుగు చిత్రసీమలో అడుగు పెట్టి అంచెలంచెలుగా ఎదిగి ఎనలేని కీర్తి ప్రతిష్టలను, ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుని మెగాస్టార్ గా నిలిచారు. రక్తనిధి, నేత్ర నిధి ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకుని సమాజం పట్ల తన బాధ్యతను నెరవేరుస్తున్నారు. ఆయన ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, సినీ ప్రేక్షకులను మరింతగా అలరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

# నాలుగేళ్లలోపు చిన్నారులకు ఆ మెడిసిన్ వద్దు

చిన్నారుల ఆరోగ్యం దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్లోర్‌ఫెనిరమైన్ మలేట్, ఫెనిలెఫ్రిన్ హైడ్రోక్లోరైడ్ కాంబినేషన్ ఔషధాల వినియోగంపై పరిమితి విధించింది. ఈ ఫార్ములేషన్ కాంబినేషన్ మందుల తయారీ, విక్రయం, పంపిణీపైనా ఆంక్షలు విధించింది. ఈ కాంబినేషన్ మెడిసిన్‌ను నాలుగేళ్లలోపు చిన్నారులకు ఉపయోగించ కూడదని స్పష్టం చేసింది. డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు, నిపుణుల కమిటీ సూచనల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కాంబి నేషన్ ఔషధాల వల్ల చిన్నారుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఫిక్స్‌డ్ డోస్ ఔషధాలను నాలుగేళ్లలోపు చిన్నారులకు వినియోగిం చకూడదని, ఆ ఔషధాల లేబుల్, ప్యాకేజీ, ప్రచార సామగ్రిపై తయారీదారులు స్పష్టమైన హెచ్చరిక నుప్రద ర్శించాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా, గతంలోనూ పలు ఫిక్స్‌డ్ డోస్ ఔషధాలను కేంద్రం బ్యాన్ చేసింది. రెండు లేదా అంతకంటే ఎక్కువ వాటిని నిర్ణీత మోతాదులో కలిపి ఫిక్స్‌డ్ డోస్ ఔషధాలను తయారు చేస్తారు.








# ఎల్‌పీజీ పైప్‌లైన్‌కు గ్రీన్‌సిగ్నల్..

## తెలంగాణకు అనుసంధానం

దేశంలో ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థను కేంద్రం బలోపేతం చేస్తోంది. తాజాగా కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. రూ.7 వేల కోట్లతో దాదాపు 1,800 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్‌ను విస్తరించేందుకు ప్రణాళిక వేస్తోంది. ఇందుకు పెట్రోలియం, నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టును తెలంగాణ రాష్ట్రానికి అనుసంధానించనుంది. గేల్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఈ పైప్‌లైన్ నిర్మాణ బాధ్యతలను చేపట్టనుంది. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల మీదుగా ఈ ప్రాజెక్టును కేంద్రం నిర్మించనుంది. తెలంగాణలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ (556 కిమీ), ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ నుంచి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ (611 కిమీ), మహారాష్ట్రలోని షిక్రాపుర్ నుంచి గోవా, కర్ణాటకలోని హుబ్లీ (633 కిమీ) వరకు ఎల్‌పీజీ పైప్‌లైన్‌లను విస్తరించనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే భారతదేశంలోని ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ 7,700 కిలోమీటర్ల నుంచి 9,500 కిలోమీటర్లకు చేరుతుంది. ఈ ప్రాజెక్టుతో లాజిస్టిక్స్ ఖర్చులు, ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రమాదాలు తగ్గనున్నాయని కేంద్రం తెలిపింది.



# మాన్సికి రజతం..

## తన్వీ, కోమల్‌లకు కాంస్యాలు

అండర్-20 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత అమ్మాయిలు మరో మూడు పతకాలు సాధించారు. మాన్సి లాథర్ రజత పతకాన్ని.. తన్వీ మగ్దుమ్, కోమల్ కాంస్య పతకాలను గెలుచుకున్నారు. 68 కేజీల విభాగం స్వర్ణ పతక పోరులో చైనాకు చెందిన చెన్‌లింగ్ సాంగ్ చేతిలో మాన్సీ 1-2 స్వల్ప తేడాతో ఓటమి పాలై రజతంతో సరిపెట్టుకుంది. 57 కేజీల విభాగంలో తన్వి10-4తో అగ్నియా (కెనడా)ను కాంస్య పతకం దక్కించుకుంది. 59 కేజీల విభాగంలో కోమల్ 5-2తో ఎడా బాలాజ్ (హంగేరీ)ని చిత్తుచేసింది. ఈ టోర్నీలో శుక్రవారం 76 కేజీల విభాగం ఫైనల్లో కాజల్ దోచాక్ గెలిచి ఛాంపియన్‌గా నిలిచింది. తను శర్మ(72 కేజీలు), సవిత (62 కేజీలు) రజతం దక్కించుకున్నారు.

# నాకు ట్రోఫీలే ముఖ్యం

### గౌతమ్ గంభీర్

**శ్రీలంకతో రెండో టెస్టు కోసం టీమ్ఇండియా సన్నద్ధమవుతోంది. ఆదివారం నుంచి కొలంబో వేదికగా మ్యాచ్ మొదలుకానుంది. తొలి టెస్టులో భారీ విజయంతో భారత్ ఉత్సాహంగా ఉంది. రెండో మ్యాచ్‌నూ గెలిచి క్లీన్‌స్వీప్ చేయాలనే లక్ష్యంతో ఉంది. ఈ క్రమంలో భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. గతంలో ఎదురైన పరాభవాల గురించి ఎక్కువగా ఆలోచించనక్కర్లేదని.. జట్టు సరైన మార్గంలోనే ఉన్నట్లు స్పష్టం చేశాడు. టెస్టు క్రికెట్‌లో భారత్ ఇబ్బంది పడుతోందనే వాదనను కొట్టిపడేశాడు.**



"మేం ఎప్పుడూ ఇబ్బంది పడలేదు. కొన్ని మ్యాచుల్లో ఫలితాలు అనుకూలంగా రానంత మాత్రాన జట్టు పతనమైనట్లు కాదు. ఇదంతా ట్రాన్సిషన్‌లో భాగం. ర్యాంకుల గురించి మేం పట్టించుకోం. గత ఇంగ్లాండ్ పర్యటన నుంచి మంచి టెస్టు క్రికెట్‌నే ఆడుతున్నాం. ప్రధాన కోచ్‌గా నా పని ట్రోఫీలను గెలవడం. నేను నమ్మేదీ అదే. దాని గురించే ఆలోచిస్తా" అని గంభీర్ స్పష్టం చేశాడు. "ఎప్పుడైనా సరే మ్యాచ్‌లో 20 వికెట్లను పడగొట్టేందుకు చూస్తాం. అలాంటి అత్యుత్తమ బౌలింగ్ ఎటాక్‌తో బరిలోకి దిగుతాం. కుల్‌దీప్ యాదవ్ మంచి బౌలర్. అందులో ఎలాంటి సందేహం లేదు. తుది జట్టు ఎంపికపై కొన్నిసార్లు కెప్టెన్ నిర్ణయం కూడా ఆధారపడి ఉంటుంది. క్రికెట్‌లో ఒడుదొడుకులు సహజం. మా ప్లేయర్లకు మేం మద్దతుగా ఉంటాం. ఒకటి లేదా రెండు మ్యాచుల ప్రదర్శన ఆధారంగా నిర్ణయాలు తీసుకోం" "శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్నాం. అయితే, నేను మూడు టెస్టుల సిరీస్ నిర్వహణకే మొగ్గు చూపిస్తా. అందుకోసం ఎలా సిద్ధమవ్వాలో ఆటగాళ్లుగా మాకు తెలుసు. అవసరమైతే ప్రాక్టీస్ సెషన్‌లను ఆప్షనల్ చేస్తాం. బౌలర్లకు ఎక్కువగా విశ్రాంతి ఇస్తాం. ఇక గాలె మైదానం మంచి టెస్టు పిచ్. అక్కడ ఆటను ఆస్వాదించాం. కొలంబోలోనూ ఇలానే ఉంటుందని భావిస్తున్నా" అని గంభీర్ తెలిపాడు.



# యాపిల్‌లో లేఆఫ్‌లు..

ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ దాదాపు 200 మంది ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించింది. ఈ కోతలు ప్రధానంగా సిరి డిజిటల్ అసిస్టెంట్, విజన్ ప్రో హెడ్‌సెట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్‌వేర్ విభాగాల్లో జరిగాయి. ఇందులో విజన్ ప్రో హార్డ్‌వేర్ విభాగం నుంచి దాదాపు 100 పోస్టులు, సిరి, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ బృందాల నుంచి మరో 100 పోస్టులను తొలగించినట్లు తెలుస్తోంది. విజన్ ప్రో కోసం గేమింగ్ ఫీచర్లను డెవలప్ చేస్తోన్న విభాగాన్ని కంపెనీ పూర్తిగా మూసివేసింది. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ మార్పులు చేస్తున్నట్లు యాపిల్ స్పష్టం చేసింది. అయితే, సంస్థలో కొత్త ఉద్యోగాలను సృష్టించడంతో పాటు.. ఈ లేఆఫ్స్ వల్ల నష్టపోయిన సిబ్బంది సంస్థలోని ఇతర విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొంది. యాపిల్ ప్రస్తుతం సిరి కోసం సరికొత్త ఏఐ ఆధారిత వెర్షన్‌ను డెవలప్ చేస్తోంది. దీనికి సాంకేతిక నైపుణ్యాలు కలిగిన సిబ్బంది అవసరం కావడంతో, ప్రస్తుత బృందంలో మార్పులు చేపట్టింది. అలాగే యాపిల్ డివైజ్‌లలో ఏఐ ఫీచర్లను పర్యవేక్షించే ఇంటెలిజెంట్ సిస్టమ్స్ ఎక్స్‌పీరియన్స్ విభాగంలోనూ మార్పులు జరుగుతున్నట్లు సంస్థ తెలిపింది. మరోవైపు, విజన్ ప్రో కోసం ఇమ్మెర్సివ్ వీడియోలకు మిలియన్ డాలర్ల ఖర్చవుతోంది. కానీ దీని వినియోగదారుల సంఖ్య పరిమితంగా ఉండటంతో కంపెనీపై ఆర్థిక ఒత్తిడి పెరిగింది. అందుకే ఇకపై సొంతంగా నిర్మించే కంటెంట్‌ను తగ్గించి, ఇతర తయారీ సంస్థలను ప్రోత్సహించాలని యాపిల్ నిర్ణయించింది. విజన్ ప్రో, విజన్‌ఓఎస్ డెవలప్‌మెంట్‌ను కొనసాగిస్తూనే, భవిష్యత్తులో 'స్మార్ట్ గ్లాసెస్'పై యాపిల్ మరింత దృష్టి పెట్టనుంది. 2028 చివరి నాటికి కొత్త విజన్ ప్రో మోడల్‌ను తీసుకొచ్చే అంశాన్ని పరిశీలిస్తోంది.



# డీఆర్ఎస్ తీసుకోవాలని ప్రత్యర్థిని రెచ్చగొట్టిన స్మిత్

ఆస్ట్రేలియా-బంగ్లాదేశ్ జట్ల మధ్య రెండో టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. మొదటి టెస్టులో బంగ్లా విజయంతో ఈసారి ఆసీస్ ఆటగాళ్లు కాస్త అగ్రెసివ్‌గా ఆడుతున్నారు. అది మైదానంలో స్పష్టంగా కనిపించింది. రెండో టెస్టు తొలి రోజు ఆటలో బంగ్లాపై ఆస్ట్రేలియా ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ క్రమంలో స్టీవ్ స్మిత్ ప్రవర్తించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. అంపైర్లు కలగజేసుకొని వార్నింగ్ ఇచ్చారు. స్టీవ్ స్మిత్ తన చర్యలతో ప్రత్యర్థులను బుట్టలో వేయాలని చూస్తుంటాడు. సరిగ్గా అలాంటిదే బంగ్లాతో మ్యాచ్‌లోనూ ప్రయోగించాడు. చివరికి వార్నింగ్ ఎదుర్కోవాల్సి వచ్చింది. బంగ్లా ప్లేయర్లు మాత్రం ఉచ్చులో పడకుండా తెలివిగా వ్యవహరించారు. తస్కిన్ బౌలింగ్‌లో స్మిత్ బంతిని ఎదుర్కొన్నాడు. అది ప్యాడ్లను తాకింది. బంగ్లా బౌలర్‌తోపాటు ఫీల్డర్లు అప్పీలు చేయగా అంపైర్ నాటౌట్ ఇచ్చాడు. తస్కిన్‌ను కెప్టెన్ షాంటో డీఆర్ఎస్ తీసుకుందామా? అని అడిగాడు. వద్దు.. ఆ బంతి కాస్త పైకి వెళుతున్నట్లు అనిపిస్తోందని తస్కిన్ చెప్పాడు. అక్కడే ఆ సంభాషణను వింటోన్న స్మిత్ కలగజేసుకొని.. లేదు మీరు తీసుకోండి అన్నట్లుగా వీడియోల్లో రికార్డైంది. కానీ, బంగ్లా మాత్రం డీఆర్ఎస్ తీసుకోలేదు. కాసేపటికే ఫీల్డ్ అంపైర్లు అలా చేయొద్దంటూ స్మిత్‌కు వార్నింగ్ ఇచ్చారు. దీంతో స్మిత్ తీరుపై సోషల్ మీడియాలో కామెంట్లు వస్తున్నాయి. ఇంత సీనియర్ అయినా సరే మారలేదంటూ కొందరు వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు బంగ్లా బ్యాటింగ్ సమయంలో జోష్ హేజిల్‌వుడ్ - తస్కిన్ వ్యవహారం కూడా వివాదాస్పదంగా మారేదే. తనను క్యాచ్ పట్టనీయకుండా తస్కిన్ అడ్డుగా వచ్చాడని అంపైర్ల దృష్టికి జోష్ తీసుకెళ్లాడు. కానీ, వాళ్లు పట్టించుకోకపోవడంతో జోష్ వదిలేశాడు.

### ఆసీస్‌కు 101 పరుగుల లీడ్

రెండో టెస్టులో బౌలర్లు చెలరేగిపోయారు. తొలుత బంగ్లాదేశ్ మొదటి ఇన్నింగ్స్‌లో 64 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ స్టార్క్ 6 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ మొదలుపెట్టిన ఆస్ట్రేలియా తొలి రోజు ఆట ముగిసేసరికి 8 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. హాఫ్ సెంచరీతో కామెరూన్ గ్రీన్ (51లి) ఆసీస్‌ను ఆదుకొన్నాడు. బంగ్లా బౌలర్ షోరిఫుల్ (6/35) దెబ్బకు ఆతిథ్య టీమ్ తీవ్రంగా ఇబ్బంది పడింది. గ్రీన్ కాకుండా.. స్టీవ్ స్మిత్ (42), ట్రావిస్ హెడ్ (22) మాత్రమే కాస్త ఫర్వాలేదనిపించారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా 101 పరుగుల ఆధిక్యంలో ఉంది. క్రీజ్‌లో గ్రీన్‌తోపాటు నాథన్ లయన్ (10) ఉన్నాడు.

# విన్నింగ్ కాంబినేషన్‌ను మార్చొద్దు..

## ఛతేశ్వర్ పుజారా కీలక వ్యాఖ్యలు



శ్రీలంకతో టీమ్ఇండియా రెండో టెస్టు ఆదివారం నుంచి మొదలుకానుంది. మొదటి మ్యాచ్‌లో అద్భుత విజయం సాధించినా.. సీనియర్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ మాత్రం పెద్దగా ప్రభావం చూపించలేదు. దీంతో అతడిని తప్పిస్తారనే ప్రచారం సాగుతోంది. జట్టులో మార్పు ఖాయమేనని.. యువ బౌలర్ సారాంశ్ జైన్‌కు అవకాశం ఇస్తారని చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ ఛతేశ్వర్ పుజారా కీలక వ్యాఖ్యలు చేశాడు. రెండో టెస్టుకు ఎలాంటి మార్పులు లేకుండానే టీమ్ఇండియా బరిలోకి దిగాలని స్పష్టం చేశాడు. "శ్రీలంకతో తొలి టెస్టులో ఏ ప్లేయింగ్ భారత్ ఆడిందో.. రెండో టెస్టులోనూ అదే టీమ్‌తో బరిలోకి దిగాలి. కుల్‌దీప్ యాదవ్ స్థానంలో సారాంశ్‌ను తీసుకుంటారనే మాటలు నా చెవినపడ్డాయి. ఎందుకంటే, శ్రీలంక జట్టులో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఎక్కువగా ఉన్నారు కాబట్టి కుడి చేతి ఆఫ్ స్పిన్నర్‌ను తీసుకుంటారనే చర్చ జరుగుతోంది. ఒకవేళ అలాంటి మార్పు చేస్తే మాత్రం తీవ్రంగా నిరుత్సాహానికి గురిచేసే నిర్ణయం అవుతుంది. కుల్‌దీప్ యాదవ్‌కు మరొక ఛాన్స్ ఇవ్వాలి. నాణ్యమైన బౌలర్ అతడు. టెస్టు క్రికెట్‌లో మరిన్ని మార్పులు చేయొద్దు. విన్నింగ్ కాంబినేషన్‌ను అస్సలు మార్చొద్దు. అందుకే, ప్లేయింగ్‌లో కుల్‌దీప్‌కు ఛాన్స్ ఇవ్వాలి" అని పుజారా తెలిపాడు. "ఒకవేళ శ్రీలంకతో రెండో టెస్టులోనూ కుల్‌దీప్ సరైన ప్రదర్శన ఇవ్వకపోయినా సరే.. అతడికి మద్దతుగా నిలవాలి. ఎంతటి క్వాలిటీ బౌలర్‌కైనా ఒక్కోసారి పరిస్థితులు కలిసిరావు. గతంలోనూ చాలా మ్యాచులకు అతడిని బెంచ్‌కే పరిమితం చేశారు. ఏదో ఒక టెస్టులో వికెట్లు తీయలేదని పక్కన పెట్టాల్సిన అవసరం లేదు. రాబోయే ఆస్ట్రేలియా సిరీస్‌లో కుల్‌దీప్ కీలకం అవుతాడని అనుకుంటున్నా" అని పుజారా తెలిపాడు.




# అమెరికాతో రూ.3800 కోట్లకు టిక్‌టాక్ ఒప్పందం

చిన్నారుల భద్రతకు సంబంధించిన కేసును పరిష్కరించుకునేందుకు ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ అమెరికా ప్రభుత్వంతో రాజీకొచ్చింది. ఇందుకుగాను ఆ దేశ న్యాయ విభాగానికి 400 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.3,800 కోట్లు) చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మొత్తాన్ని రెండు దఫాలలో చెల్లించనున్నట్లు వెల్లడించింది. దీంతో 2024లో దాఖలైన ఈ వ్యాజ్యం ముగిసింది. టిక్‌టాక్ తమతో రాజీ చేసుకోవడం దేశంలోని పిల్లలు, తల్లిదండ్రులకు ఒక పెద్ద విజయమని అమెరికా అసోసియేట్ అటార్నీ జనరల్ స్టాన్లీ పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పిల్లలకు రక్షణ కల్పించడం.. వారి వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియా యాప్‌లు గోప్యంగా ఉంచేలా పర్యవేక్షించడం తమ బాధ్యత అని తెలిపారు. 13 ఏళ్లలోపు పిల్లల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే ముందు, పిల్లల కోసం ఉద్దేశించిన యాప్‌లు, వెబ్‌సైట్‌లు తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాలని నిర్దేశించే ఫెడరల్ చట్టాన్ని టిక్‌టాక్, దాని చైనా ఆధారిత మాతృ సంస్థ బైట్‌డాన్స్ ఉల్లంఘించాయని ఆరోపిస్తూ.. 2024లో న్యాయ శాఖ వ్యాజ్యం దాఖలు చేసింది. నాటి నుంచి టిక్‌టాక్‌లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్ సంస్థ తన వాటాలను తగ్గించుకుంది. దీంతో కొత్త టిక్‌టాక్ యూఎస్ జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయడానికి ఒరాకిల్, సిల్వర్ లేక్, ఎమిరేట్స్ పెట్టుబడి సంస్థ ఎంజీఎక్స్ వంటి ప్రధాన పెట్టుబడిదారులతో ఒప్పందం చేసుకుంది.

# వైభవ్ సూర్యవంశీకి రెడ్ బాల్ పరీక్ష

భారత క్రికెట్‌లో సరికొత్త సంచలనంగా మారిన 15 ఏళ్ల డాషింగ్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీ రూపంలో కీలకమైన రెడ్ బాల్ పరీక్ష ఎదురుకానుంది. ఆదివారం నుంచి బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నార్త్ ఈస్ట్ జోన్‌తో జరగనున్న క్వార్టర్‌ఫైనల్ పోరులో ఈస్ట్ జోన్ తరఫున అతడు బరిలోకి దిగనున్నాడు. పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో, ఐపీఎల్‌లో అద్భుతమైన స్ట్రైక్ రేట్‌తో చెలరేగినప్పటికీ, ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇప్పటివరకు సూర్యవంశీ గణాంకాలు అంత ఆశాజనకంగా లేవు. బిహార్ తరఫున ఆడిన 8 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో (12 ఇన్నింగ్స్‌లు) కేవలం 17.25 సగటుతో 93 అత్యధిక స్కోరు సాధించిన అతనికి.. అనుభవం లేని నార్త్ ఈస్ట్ బౌలింగ్ విభాగంపై పరుగులు రాబట్టి ఆత్మవిశ్వాసాన్ని పెంచుకునేందుకు ఇది ఒక గొప్ప అవకాశంగా మారనుంది. త్వరలో జరగనున్న ఆస్ట్రేలియా 'ఎ' సిరీస్ ఎంపికలను దృష్టిలో ఉంచుకుని సెలెక్టర్లు ఈ టోర్నీలో యువ ఆటగాళ్ల ప్రదర్శనను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ జట్టుకు వైస్ కెప్టెన్‌గా నియమితుడైన సూర్యవంశీ, సుదీర్ఘ ఫార్మాట్‌లో క్రీజులో నిలకడగా ఆడే సత్తాను నిరూపించుకోవాల్సి ఉంది. ఆగస్టు 30 నుంచి జరిగే సెమీఫైనల్స్‌లో సెంట్రల్, సౌత్ జోన్ వంటి బలమైన జట్లతో తలపడే ముందే అతడు ఫామ్ అందుకోవడం ఈస్ట్ జోన్‌కు కీలకం కానుంది.





# చిరు సినిమాకు కాకాగా టైటిల్

## బర్త్‌డే సందర్భంగా టైటిల్ రిలీజ్




అగ్ర కథానాయకుడు చిరంజీవి ప్రధానపాత్రలో బాబీ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా టీమ్ అప్‌డేట్ ఇచ్చింది. సినిమా టైటిల్‌ను 'కాకా'గా ఖరారు చేస్తూ ఓ వీడియోను షేర్ చేసింది. ఇందులో చిరంజీవి మధ్యతరగతి వ్యక్తిగా కనిపిస్తున్నారు. అక్వా సంస్థలో ఉద్యోగిగా చిరంజీవి సత్యం అనే పాత్రలో నటిస్తున్నారు. 'ఇది సత్యం మాట.. ఇంకా డౌటా' అనే డైలాగు ఆయన పాత్ర స్వభావాన్ని తెలుపుతోంది. ఇందులో కనిపించిన 'ఐ లవ్ డాడీ' అనే కీ చైన్‌కు.. ఫ్లాష్ బ్యాక్‌లో ఆయనకు తండ్రితో అనుబంధం ఉండే అవకాశమున్నట్లు తెలుస్తోంది. టైటిల్ రివీల్ అనంతరం యంగ్ అండ్ స్టైలిష్ లుక్‌లో గన్స్ పేలుస్తూ చిరంజీవి ఇచ్చిన మాస్ పోజు.. మెగా ఫ్యాన్స్‌కు వింటేజ్ చిరును గుర్తుచేస్తోంది. ఇక 'కాకా' సినిమా సంక్రాంతి కానుకగా 2027 జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది

# ఆత్మవిశ్వాసమే అసలైన అందం

'యానిమల్' చిత్రంతో ఇండస్ట్రీకి వచ్చి తనదైన సత్తాచాటిన త్రిప్తి డిమ్రి.. తెలుగు, హిందీ ఇండస్ట్రీల్లో సినిమాలు చేస్తున్నారు. గత ఏడాది 'ధడక్-2' సినిమాతో విమర్శకుల ప్రశంసలు పొందిన ఈ భామ.. తెలుగులో ఓ భారీ ప్రాజెక్ట్ చేయబోతున్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న 'స్పిరిట్'లో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా చాన్స్ దక్కించుకున్నారు. ప్రస్తుతం షూటింగ్‌లో పాల్గొంటున్న ఆమె.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఆసక్తికర కామెంట్స్ చేశారు. కాన్ఫిడెన్స్, గ్లామర్, ఆకర్షణ.. ఈ మూడింటిలో మీరు దేనికి ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తారని యాంకర్ అడగ్గా.. త్రిప్తి ఏమాత్రం తడబడకుండా ఆత్మవిశ్వాసమే అసలైన అందం అని చెప్పారు. తన దృష్టిలో కాన్ఫిడెన్స్ అనేది బయట నుంచి ఎక్కడి నుంచో తెచ్చుకునేది కాదని ఆమె అన్నారు. ఒక్కసారి మనపై మనకు పూర్తి నమ్మకం ఏర్పడితే మిగిలినవన్నీ దానంతట అవే మనల్ని అనుసరిస్తాయని తెలిపారు. వయసు పెరిగే కొద్దీ అందం, ఆకర్షణపై తన ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయిందని త్రిప్తి వెల్లడించారు. చిన్నతనంలో కేవలం శారీరక రూపం, పైకి కనిపించే అందం మాత్రమే ముఖ్యమనుకునేదాన్నని, కానీ ఇప్పుడు తన ఆలోచన పూర్తిగా మారిందని చెప్పారు. నిజమైన ఆకర్షణ అంటే మనపై మనకున్న నమ్మకం, స్వయం గౌరవం, సొంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకునే శక్తి కలిగి ఉండటమేనని ఆమె చెప్పుకొచ్చారు. నలుగురిలోకి వెళ్లేముందు తనని తాను ప్రశాంతంగా ఉంచుకోవడానికి ప్రాధాన్యం ఇస్తాననిపేర్కొన్నారు. ఇతరులతో సంబంధం ఏర్పరచుకోవడానికి ముందు, మన మనసుతో మనం కనెక్ట్ అవ్వడం అత్యంత కీలకమని ఆమె అభిప్రాయపడ్డారు.

# నా నిజమైన హీరో మా అన్నయ్యే

## చిరు బర్త్‌డే సందర్భంగా పవన్ కళ్యాణ్ విషెస్



మెగాస్టార్‌గా చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ ప్రత్యేక రోజున జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన అన్నయ్య చిరంజీవితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ హృదయాన్ని హత్తుకునే ఎమోషనల్ పోస్ట్‌ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. చిన్ననాటి నుంచి చిరంజీవి తనకు కేవలం అన్నయ్య మాత్రమే కాదని, ఎప్పటికీ తన హీరోనే అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. చిరంజీవి కళాశాల చదువుల కోసం నర్సాపూర్ వెళ్లిన రోజులను గుర్తు చేసుకుంటూ, వేసవి సెలవుల్లో ఆయన ఇంటికి రావడం తమ కుటుంబానికి పండగలా ఉండేదని తెలిపారు. తిరిగి చదువుల కోసం వెళ్లిపోయినప్పుడు ఇంట్లో ఒక వెలితి కనిపించేదని, ఆయన తిరిగి వచ్చే వరకు ఆ ఆనందం ఉండేది కాదని భావోద్వేగంగా రాశారు. తన పాఠశాల రోజుల నుంచే అన్నయ్యపై తనకు ఎంతో గర్వం ఉండేదని పవన్ తెలిపారు. చిరంజీవి ఇంకా హీరో కాకముందే తన దృష్టిలో ఆయన హీరో అని చెప్పారు. పొడవాటి జుట్టు, బెల్‌బాటమ్ ప్యాంట్, కళ్లద్దాలు ధరించి తమ తండ్రి బులెట్ బైక్ నడుపుతూ కనిపించే చిరంజీవిని చూసిన క్షణాలు ఇప్పటికీ మర్చిపోలేనివని పేర్కొన్నారు. చిరంజీవి తన కెరీర్ తొలినాళ్లలో సింగపూర్ పర్యటనకు వెళ్లి వచ్చిన సందర్భంగా తమ కోసం తెచ్చిన బహుమతులను కూడా పవన్ గుర్తు చేసుకున్నారు. పెద్ద నీలిరంగు బ్యాగ్‌లో తన కోసం తీసుకొచ్చిన చిన్న లెగో హెలికాప్టర్, రిమోట్ కార్లు, రేసింగ్ ట్రాక్, కామిక్స్, మ్యూజిక్ టేపులు, టేప్ రికార్డర్, పెర్ఫ్యూమ్‌లు వంటి బహుమతులు తన చిన్ననాటి జ్ఞాపకాలలో ప్రత్యేకంగా నిలిచిపోయాయని చెప్పారు. చిరంజీవి ఎప్పుడూ తమ ఇంటికి ఆనందాన్ని, చిరునవ్వులను తీసుకొచ్చేవారని తెలిపారు. దక్షిణాది, హిందీ చిత్ర పరిశ్రమల మధ్య సాంస్కృతిక వారధిగా చిరంజీవి కీలక పాత్ర పోషించారని పవన్ కళ్యాణ్ ప్రశంసించారు. సాంకేతికతపై ఆసక్తి, దాతృత్వం, కుటుంబంపై ప్రేమ, నటుడిగా సాధించిన అపారమైన విజయాలు.. కేంద్ర మంత్రిగా నిర్వహించిన బాధ్యతలు.. జాతీయ పురస్కారాలు, పద్మవిభూషణ్ వంటి అత్యున్నత గౌరవాలు అందుకున్నప్పటికీ ఆయనలో పనిచేయాలనే తపన మాత్రం ఎప్పుడూ తగ్గలేదని పేర్కొన్నారు. ఇటీవల ఆరోగ్యపరమైన చికిత్స తర్వాత కూడా చిరంజీవి ఎంతో వేగంగా కోలుకుని మళ్లీ షూటింగ్‌లకు వెళ్లడం ఆయనలోని అద్భుతమైన శక్తికి నిదర్శనమని పవన్ అన్నారు. 'నగరం ఎప్పుడూ నిద్రపోనట్లే, ఆయన కూడా ఎప్పుడూ విశ్రమించరు. అందుకే ఆయన మా ప్రియమైన మెగాస్టార్.. నాకు మాత్రం ఎప్పటికీ నా ఏకైక హీరో' అంటూ పవన్ తన అన్నయ్యపై ఉన్న ప్రేమను చాటుకున్నారు.

# ఇరుముడి బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్




మాస్ మహారాజా రవితేజ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇరుముడి' ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్‌తో మంచి జోష్‌లో దూసుకెళ్తుంది. రిలీజ్ అయిన ఫస్ట్ డేనే పాజిటివ్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా.. ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందనతో భారీ వసూళ్ల దిశగా వేగంగా అడుగులు వేస్తోందని ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో 'ఇరుముడి'కు సంబంధించి ఓ ఆసక్తికరమైన విషయం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే పూర్తి నమ్మకంతో ముందుకు వెళ్లినట్లు సమాచారం. కథ, కాన్సెప్ట్‌పై నమ్మకం ఉన్నప్పటికీ.. ఓటీటీ రైట్స్ విషయంలో సినిమా స్టార్టింగ్‌లో మాత్రం అనుకున్న స్థాయిలో ఆసక్తి కనిపించలేదనే ప్రచారం జరిగింది. ముఖ్యంగా ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ తొలుత 'ఇరుముడి' డిజిటల్ రైట్స్‌పై పెద్దగా ఆసక్తి చూపలేదని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపించింది. అయినప్పటికీ మైత్రీ మూవీ మేకర్స్ ఎక్కడా వెనక్కి తగ్గకుండా.. కథ, రవితేజ పాత్ర, శివ నిర్వాణ టేకింగ్‌పై ఉన్న నమ్మకంతో ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలుస్తోంది. సినిమా ప్రమోషన్స్ మొదలైన తర్వాత పరిస్థితులు మారినట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ముఖ్యంగా 'ఇరుముడి' టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తర్వాత సినిమాపై ఒక్కసారిగా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరగడంతో పాటు, ఈ చిత్రంలో రవితేజను ఇంతకుముందెన్నడూ చూడని విధంగా కొత్త తరహా పాత్రలో చూపిస్తున్నారనే విషయం బయటకు రావడంతో ప్రేక్షకుల్లో అంచనాలు ఈ మూవీపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ క్రేజ్‌ను గమనించిన నెట్‌ఫ్లిక్స్.. ఆ తర్వాత 'ఇరుముడి' డిజిటల్ రైట్స్ కొనుగోలుకు ఆసక్తి చూపినట్లు ప్రచారం జరుగుతోంది. చివరకు మైత్రీ మూవీ మేకర్స్‌తో ఒప్పందం కుదుర్చుకుని ఓటీటీ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకున్నట్లు ప్రస్తుతం సినీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ప్రస్తుతం థియేటర్లలో ఈ సినిమాకు వస్తున్న స్పందనను చూస్తే.. మైత్రీ మూవీ మేకర్స్ ఈ కథపై పెట్టుకున్న నమ్మకం ఫలించినట్లే కనిపిస్తోందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒకవైపు బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా మంచి వసూళ్లు సాధించే దిశగా దూసుకెళు తుండగా.. మరోవైపు డిజిటల్ రైట్స్ దక్కించుకున్న నెట్‌ఫ్లిక్స్‌కు కూడా ఈ విజయం కలిసొచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# స్పిరిట్ కోసం భారీగా పారితోషికం డిమాండ్

## నటి దీపికా పడుకొణెపై ప్రణయ్ ఆరోపణలు




ప్రభాస్ హీరోగా సందీప్ వంగా దర్శకత్వంలో రానున్న చిత్రం 'స్పిరిట్' నుంచి దీపికా పదుకొణె వైదొలగడంపై అప్పట్లో తీవ్ర చర్చ జరిగింది. తాజాగా సందీప్ సోదరుడు ప్రణయ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆమె ప్రాజెక్ట్‌ను నుంచి వెళ్లిపోవడానికి కారణాన్ని పంచుకోవడంతో ఈ విషయం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. దీపిక ఈ సినిమా నుంచి వైదొలగడానికి కారణాన్ని ప్రణయ్ వివరించారు. తన డేట్స్ సర్దుబాటు చేయడంతో పాటు దీపిక భారీ పారితోషికం అడిగారని చెప్పారు. అలాగే సినిమా లాభాల్లో 10 శాతం వాటా అడిగారని తెలిపారు. ఈ కామెంట్స్ ఒక్క రోజుల్లోనే టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగ్రా మారాయి. తాజాగా దీనిపై ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌కు దీపిక లైక్ చేసి తన స్పందనను పరోక్షంగా తెలిపారు. 'ఒక మహిళ ఇలాంటి డిమాండ్‌లు చేస్తే సహించలేకపోతున్నారు. ఆమె నో చెప్పడం వల్ల ఈగో సమస్యలు వచ్చాయి. ఇది కేవలం పురుషాధిక్య అహంకార సమస్య మాత్రమే అని ఇన్‌స్టాలో ఒకరు పెట్టిన పోస్ట్‌కు దీపిక లైక్ చేయడం ఇప్పుడు వైరల్ అవుతోంది. హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రానున్న 'స్పిరిట్' లో మొదట దీపికను ఎంపిక చేశారు. ఈ ప్రాజెక్ట్ కోసం దర్శకుడు సందీప్ ఆమెతో ఏడాదిన్నర వర్క్ చేశారు. అయితే ఆ తర్వాత దీపిక స్థానంలోకి త్రిప్తి దిమ్రిని తీసుకున్నారు. ఆ సమయంలో దీపిక ఈ కథను లీక్ చేశారనే ఆరోపణలు కూడా వచ్చాయి.



# ఈశ్వర్ సాయి భార్యపై పోలీసులకు ఫిర్యాదు చేసిన మాధురి రాథోడ్

ఫోక్ డ్యాన్సర్స్ ఈశ్వర్ సాయి, మాధురి రాథోడ్ ఇష్యూలో కీలక పరిణామం చోటు చేసుకుంది. తనపై ఈశ్వర్ సాయి భార్య అనవసరంగా దాడి చేసింది అంటూ వేములవాడ పోలీస్ స్టేషన్ లో మాధురి రాథోడ్ ఫిర్యాదు చేసింది. తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఈశ్వర్ సాయి భార్య శరణ్య బూతులు తిడుతూ అకారణంగా తనపై చేయి చేయి చేసుకుందని పేర్కొంది. తనపై ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియా మాధ్యమాల్లో పలువురు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారిపై కూడా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరింది. ఈశ్వర్ సాయి భార్య తన వీడియోలను చిత్రించడమే కాకుండా, తన ఐఫోన్ కూడా దొంగలించారని పేర్కొంది. మాధురి రాథోడ్ ఫిర్యాదు మేరకు వేములవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఇదిలా ఉంటే రీసెంట్‌గా ఈశ్వర్ సాయి, మాధురి రాథోడ్ వేములవాడలోని ఓ లాడ్జిలో రెడ్ హ్యాండెడ్‌గా శరణ్యకు పట్టుబడ్డారు. దీంతో శరణ్య మాధురి రాథోడ్‌పై దాడి చేసి బూతులు తిట్టింది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తరవాత తాము కాంప్రమైజ్ అయ్యామని, ఇకపై వీడియోలు షేర్ చేయవద్దని శరణ్య ఓ ఇంటర్వ్యూలో కోరింది. ఇంతలోనే మాధురి రాథోడ్ కేసు పెట్టడం ఆసక్తికరంగా మారింది.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com